మనసులోమాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
ఆదివారం 17 మే 2026 పేజీలు : 16

పేదరికం లేని సమాజమే లక్ష్యం

- సమాజం మారితేనే స్వచ్ఛాంధ్ర సాకారం : సీఎం చంద్రబాబు నాయుడు
- ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారంభం
- పిల్లలు భారమనుకోవద్దు
- మూడో పిల్ల పుడితే 30 వేలు నాలుగో పిల్ల పుడితే 40 వేలు తల్లికి వందనం పెంచుతాం
- ప్రధాని మోదీ పిలుపు మేరకు జిల్లా పర్యటనల్లోనూ ఇంధన పొదుపు చర్యలను పాటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- తన కాన్వాయ్‌ను 4 వాహనాలకే కుదించుకుని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించిన ముఖ్యమంత్రి

మిగతా 2

భద్రతా చైతన్యం

అభయం హెల్మెట్ బ్యాంకు స్టాల్‌ను సందర్శించిన రాష్ట్ర ముఖ్యమంత్రి

మిగతా 2

భోగాపురం అనుసంధాన రోడ్లను

మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలి

- సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖ సిటీ మే16(మనసులో మాట).. విశాఖ నగరం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను మిషన్ మోడ్‌లో చేపట్టి జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం భోగాపురం విమానాశ్రయ ప్రాంతాన్ని సందర్శించిన - మిగతా వార్త 2లో

సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సందర్శన

నరసన్నపేట, మే 16: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసన్నపేటలో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. స్వచ్ఛరథం డ్రైవర్ నవగవు ప్రసాద్ రావు మండలంలో ఇంటింటికీ వెళ్లి వ్యర్థాల సేకరిస్తున్న విధానాన్ని సీఎంకు వివరించారు. అనంతరం సార్టింగ్ కన్వేయర్ సిస్టమ్ వద్ద అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడిన ముఖ్యమంత్రి వ్యర్థాల వర్గీకరణ ప్రక్రియను పరిశీలించారు. గతంలో నేరుగా చేతులతోనే వ్యర్థాలను వర్గీకరించే వారమని, ఇప్పుడు యంత్రాల రాకతో వర్గీకరణ సామర్థ్య పెరిగిందని వివరించారు. ప్రాసెస్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి తయారైన ఉత్పత్తులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు.

భద్రతా చైతన్యం

అభయం హెల్మెట్ బ్యాంకు స్టాల్‌ను సందర్శించిన రాష్ట్ర ముఖ్యమంత్రి

శ్రీకాకుళం (నరసన్నపేట), మే 16: శనివారం నరసన్నపేటలో నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ప్రజా వేదిక ప్రాంగణంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "అభయం హెల్మెట్ బ్యాంకు" స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ముఖ్యమంత్రికి అభయం హెల్మెట్ బ్యాంకు కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానం గురించి విపులంగా వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి వారికి తాత్కాలికంగా హెల్మెట్ అందజేస్తామని, వారు 48 గంటలలోపు స్వయంగా కొత్త హెల్మెట్ కొనుగోలు చేసి హెల్మెట్ బ్యాంకుకు తిరిగి అందజేసే విధంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ విధానం ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన హెల్మెట్ డ్రైవింగ్ అలవాటు మరియు భద్రతా చైతన్యం పెరుగుతోందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి అభినందిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. అలాగే జిల్లా పోలీసు శాఖ చేపట్టిన అభయం హెల్మెట్ బ్యాంకు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. ముఖ్యమంత్రి స్వయంగా హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనాన్ని అధిరోహించి ప్రజల్లో హెల్మెట్ ధారణ మరియు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

బుల్లెట్ నడిపిన చంద్రబాబు

నరసన్నపేట (మనసులో మాట) మే 16 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేట పర్యటనలో బుల్లెట్ నడిపి, టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచారు. 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు ప్రజావేదిక సమీపంలోని స్టాళ్లను పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్వర ఆర్ట్ గ్యాలరీ'లో గిరిజనులు ప్రత్యేకంగా రూపొందించిన ఓవర్ కోటును ఆయన కొనుగోలు చేసి ధరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్ను సందర్శించారు. పోలీసులను అభినందించిన సీఎం హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం ఎక్కారు. ఆయన వెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ఉన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

నరసన్నపేట, మే 16 (మనసులో మాట) : సమాజం మారితేనే స్వచ్ఛాంధ్ర సాకారమవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పేదరికం లేని సమాజం చూడాలనేదే తన తపన అన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం పెంచాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచాలని, ఆర్థిక అసమానతలు తగ్గించాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నానని అన్నారు. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది అధికారుల వల్లే వస్తుందన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాభని, పిల్లలే సంపద అని ఇవాళ చెబుతున్నాభని, మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు ఇస్తామని, నాలుగో బిడ్డ పుడితే రూ.40 వేలు ఇస్తామని తెలిపారు. పిల్లలు భారమనుకోకూడదని, వాళ్లే సంపద అని గుర్తించాలని సూచించారు. తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తున్నామన్నారు. భగవంతుడు కరుణిస్తే ఈ మొత్తాన్ని పెంచుతామన్నారు. గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ చేసిన అరాచకం చూశామని, ప్రజల ఆస్తులన్నీ మార్చేసి గందరగోళం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు చేపట్టామన్నారు. భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నామన్నారు. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలని, అదే మనకు మంచి చేస్తుందని తెలిపారు. 'అలవాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది' అన్నారు. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు. వ్యర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు తన పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేదని, చెత్త నుంచి సంపద సృష్టించడానికి పార్కులు ఏర్పాటు చేశామని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను నిషేధించాలని కోరారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం నుంచే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల్లో నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. హఇందులో భాగంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతిరోజూ క్లీన్ స్వీప్ చేయాలన్నారు. గత 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో మన పిల్లలకు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. విశాఖకు గూగుల్ తీసుకొచ్చాభని, 'ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెల్లడం కాదు, పరిశ్రమలతో ఉత్తరాంధ్రకే వలసలు రావాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భోగాపురం అనుసంధాన రోడ్లను

మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలి

- మొదటి పేజీ తరువాయి కలెక్టర్, విమానాశ్రయ నిర్మాణ పురోగతితో పాటు అనుసంధాన రహదారులు, కూడళ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల కూడళ్ల వద్ద పటిష్ట నిర్మాణ పనులు చేపట్టాలని, భవిష్యత్తు ట్రాఫిక్, భద్రత అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఎయిర్ పోర్టు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపనున్న బ్యాటరీ వాహనాల కోసం విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారి, నగర పరిధిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల దిశలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ, ఆర్&బి శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనులను వేగవంతం చేయాలని, జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయా రహదారుల వెంట విద్యుత్ దీపాల అమరిక పనులను కూడా సమయానికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. పనులన్నింటినీ సమన్వయంతో, మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఫారెస్ట్ శాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశం అనంతరం కలెక్టర్ ఎయిర్ పోర్టు లోపలి భాగాలను, ఏటీసీ కార్యాలయంను సందర్శించారు.

సమావేశంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఎయిర్‌పోర్టు సీఈవో కన్వర్ బీర్ సింగ్, సీడీవో కోటేశ్వరరావు, జీఎంఆర్ కార్పొరేట్ అఫైర్స్ అధికారి రామరాజు, సీఎస్వో శాస్త్రి, సీవోవో లక్ష్మీవర్మ భాస్కర్, వీఎంఆర్డీఏ సీఈ వినయ్, జీవీఎంసీ సీఈ సత్యనారాయణరాజు, సీసీపీ ప్రభాకర్, ఆర్&బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

- భోగాపురం ఎయిర్ పోర్టును దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాయుతంగా వ్యవహరించాలి

- పలు విభాగాల అధికారులతో కలిసి కూడలిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

విశాఖ సిటీ మే16(మనసులో మాట).. ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా సమగ్ర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శనివారం ఎయిర్ పోర్టు, జాతీయ రహదారి విభాగం, వీఎంఆర్డీఏ, రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులతో కలిసి ఆనందపురం కూడలిని పరిశీలించిన ఆయన ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణం అమలు చేయగల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఫ్లైఓవర్ కింద విస్తరణ పనులు చేపట్టి, తాత్కాలికంగా ట్రాఫిక్ సమస్యలను తగ్గించే చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేలా ప్రాంత పరిస్థితులను సూక్ష్మంగా అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని హితవు పలికారు.

భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, భోగాపురం ఎయిర్‌పోర్టు సీఈవో కన్వర్ బీర్ సింగ్, ఎన్.హెచ్.ఎ.ఐ. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్, వీఎంఆర్డీఏ సీఈ వినయ్ కుమార్, జీవీఎంసీ సీఈ సత్యనారాయణ రాజు, జీఎంఆర్ కార్పొరేట్ అఫైర్స్ అధికారి రామరాజు, సీఎస్వో శాస్త్రి, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నేడు జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి

- 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' పర్యటన ఘన స్వాగతం పలికిన ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్

నరసన్నపేట, మే 16: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి పర్యటన సందర్భంగా తామరాపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్(జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు) జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులు బగ్గ రమణమూర్తి, బెందాలం అశోక్, గొండు శంకర్, కూన.రవికుమార్ ,గౌతు శిరీష, , మామిడి గోవిందరావు, ఎన్. ఈశ్వరరావు, , ఎస్పీ. మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఇతర అధికారులు, జిల్లా ప్రతినిధులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు.

సంక్షోభం నుంచి బయట పడాలంటే..

ఆర్థిక భారం భరించాల్సిందే..!

- గ్యాస్ తో వంట.... యుద్ధం తెచ్చిన తంటా....
- మధ్యతరగతి కుటుంబానికి ఆర్థిక షాక్...
- డీజిల్ పెట్రోల్ ధరలు మరింత పెంపు.
- ప్రధానమంత్రి మోడీ "పొదుపు" పిలుపును పాటించండి
- పొదుపు చేయండి.... దేశ ప్రగతికి బాసటగా నిలవండి

మల్కాపురం, మే 16: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు సెగలు అన్ని రకాలుగా ఇప్పుడు సామాన్యుడి వంటింట్లోకి చేరుతున్నాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ధరలు లీటర్ కు సగటున రూ.3 వరకు పెరగడం కేవలం వాహనదారులకే కాదు ప్రతి మధ్యతరగతి కుటుంబానికి ఒక పెద్ద 'ఆర్థిక షాక్' ఇప్పటికే నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యుడిపై ఈ పెరుగుదల "గోరుచుట్టుపై రోకలి పోటు" లా మారింది. ప్రమాద ఘటికలు మోగి స్తున్న రవాణా ఛార్జీలు, ఇంధన ధరల పెరుగుదల ప్రభావం నేరుగా రవాణా రంగంపై పడుతుంది. డీజిల్ ధర పెరిగితే సరుకు రవాణా చేసే లారీలు, దేశ వ్యాప్త లారీ యజమానులు తమ చార్జీలను పెంచక తప్పదు.

దీనివల్ల నిత్యావసరాలైన పప్పు దినుసులు, బియ్యం, పాలు, కూరగాయలు, గుడ్లు, మాంసం, వంటి రోజువారీ వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయి. రైతుల నుంచి మార్కెట్, మార్కెట్ నుంచి రిటైల్ దుకాణాలకు సరుకు చేరేలోపు రవాణా ఖర్చు రెట్టింపు భారం పడడంతో ఇది అంతిమంగా ఈ భారం అతా వినియోగదారుడే మోయాల్సి వస్తుంది.

చదువు కోసం వెళ్లే విద్యార్థులు, ఉద్యో గాల కోసం తిరిగే సామాన్యులు ఇప్పుడు ప్రయాణ ఖర్చుల లెక్కలు వేసుకోవాల్సి స్తోంది. ఆటో ఛార్జీలు, టాక్సీలు, ప్రైవేట్ బస్సుల, ఛార్జీలు పెరగడం ఖాయంగా కనిపి స్తోంది. ఇప్పటికి పెరిగిన మెట్రో ఛార్జీలతో సతమతమవుతున్న నగరవాసులకు, తాజా పెట్రో ధరల పెరుగుదల అదనపు భారం. ఆన్లైన్, స్విగ్గి, జొమాటో, ఆహారాన్ని సరఫరా సంస్థలు కూడా "ఫ్యూయల్ సర్చార్జ్" పేరుతో డెలివరీ ఛార్జీలను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పెద్ద పెద్ద హోటల్ యాజమాన్యాలు రేట్లును పెంచి వేయడం జరిగింది. దీంతోపాటు

దేశానికి వెన్నెముక అయిన రైతుపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా పడనుంది. సాగు పను లకు వినియోగించే ట్రాక్టర్లు ,నీటి మోటార్లు , పంట కోత యంత్రాలన్నీ డీజల్ తోనే నడుస్తాయి. ఇప్పటికే ఎరువులు, విత్తనాల, ధరలు పెర గడంతో సతమతమవుతున్న రైతుకు, ఇప్పుడు సాగు, రవాణా వ్యయం పెరగడం పెద్ద సమస్యగా మారింది. ఇది చివరకు వంట పెరుగుదలకు దారితీసి మళ్ళీ సామాన్యుడి భోజనం వైపే ప్రభావం చూపుతోంది. ఇక సామాన్య మానవుని ఇంటి నిర్మాణ కల నెరవేరేటట్లు కనబడుటలేదు, ఎందుకంటే వాటికి కావాల్సిన సిమెంట్, ఇసుక, ఇనుము నిర్మాణ సామగ్రిని భారీ వాహనాల్లోరవాణా చేయవలసి ఉంటుంది. డీజిల్ ధరల ప్రభావంతో ఈ వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరుగుతాయి. దీనివల్ల సామాన్యుడి సొంతింటి కల మరింత వ్యయప్రయాసలతో కూడుకున్నదిగా మారనుంది. కాంట్రాక్టర్లు, డెవలపర్లు ఈ అదనపు వ్యయాన్ని ప్రాజెక్ట్ ధరల్లో కలిపే అవకాశాలు లేకపోలేదు. జీతాలు పెరగవు కానీ ఖర్చులు మాత్రం రెక్కలు కట్టుకుని ఎగురుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్య తరగతి కుటుంబాలు తమ ఆర్థిక ప్రణాళికలను మార్చుకోక తప్పదు. అనవసర ప్రయాణాలకు స్వస్తి పలకడం , వ్యక్తిగత వాహనాల వినియోగం తోపాటు వినోదం, బయట భోజనాలు, విందులు, వంటి ఖర్చులను తగ్గించుకోవడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అనిశ్చితి పరిస్థితుల్లో సామాన్యుడు అంతర్జాతీయంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, తో పాటు పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు తగ్గకపోతే ముడి చమురు ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరి స్తున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం పన్నుల తగ్గింపు ద్వారా ఉపశమనం కలిగించక పోతే.. సామాన్యుడి ఆర్థిక పరిస్థితి మరింత దారుణంగా మారుతుం దోనని జనం చర్చించుకుంటున్నారు. "సంపాదన స్థిరం.. ఖర్చు అస్థిరం" అన్నట్లుగా తయారైంది ప్రస్తుత పరిస్థితి. ఇటువంటి సమస్యలను అధిగమించాలంటే భారత దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించిన పొదుపు మంత్రాన్ని పాటించక తప్పదు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

గాజువాక (మనసులోమాట)మే 16 .. గాజువాకలో బీసీ రోడ్డులో గల దారుల్ ఉలూమ్ ఇషాకియా నూరియా మదర్సానందు మదర్సా కమిటీ ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాల పైబడిన విద్యార్థులకు విద్యార్థినులకు మదర్సా లో ఉన్నటువంటి ఇస్సాక్య నురియా ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఫ్రీ సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరిగినది ఈ క్యాంపు నందు హ్యాండ్ రైటింగ్ ఆర్ట్ క్రాఫ్ట్ స్టోరి స్పెల్లింగ్ కంప్యూటర్ బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్ డ్రాయింగ్ పెయింటింగ్ బ్రెయిన్ జిమ్ యాక్టివిటీ సమ్మర్ క్యాంపు నందు మే ఒకటో తారీకు నుండి 15వ తారీకు వరకు నేర్పించడం జరిగినది ఈ యొక్క సమ్మర్ క్యాంపుకు సుమారు 150 మంది విద్యార్థులు విద్యార్థినులు హాజరు కావడం జరిగినది వీరికి శిక్షణ ఇచ్చిన తర్వాత వీరందరికీ మదర్సా కమిటీ ద్వారా మదర్సా కమిటీ వైస్ ప్రెసిడెంట్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ గారి చేతుల మీదుగా సర్టిఫికెట్ మెమెంటోస్ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపాల్ ముక్తి జాఫర్ అలీ గారు మరియు ముజాహిద్ గారు మదర్సా కమిటీ సభ్యులు అన్వర్ రిజ్వాన్ జహంగీర్ మరియు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యం

స్వచ్ఛ సర్వేక్షన్' సైకిల్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి , మే 16: పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం పార్వతీపురంలోని మున్సిపల్ పార్క్, శివాలయం వీధి చెరువు పరిసరాల్లో నిర్వహించిన "స్వచ్ఛ భారత్ స్వర్ణ భారత్" కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షన్' సైకిల్ ర్యాలీలో అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్లాస్టిక్ రహిత నగరాలు ప్లాస్టిక్ రహిత పల్లెలు అనే నినాదంతో పాటు వ్యర్థాల నిర్వహణలో 3ఆర్ విధానం (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) అమలు చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. గతంలో అడవిలా మారి ప్రజలకు ఉపయోగం లేకుండా పోయిన స్థానిక చెరువు పరిసర ప్రాంతాన్ని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. వాడేసి పారేసిన వస్తువులను వినియోగించి ఆ ప్రాంతాన్ని అందమైన పార్కుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువత కోసం సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, రన్నింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. పట్టణానికి అవసరమైన మొక్కలను ఇక్కడే పెంచేలా చెరువు పరిసరాలను నర్సరీగా అభివృద్ధి చేయనున్నామని, చెరువులోని నీటిని శుద్ధి చేసి తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా చేయడమే లక్ష్యమన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, వాడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా వాటిలో చిన్న మొక్కలు పెంచాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా తప్పనిసరిగా డస్ట్‌బిన్లలోనే వేయాలని ప్రజలను కోరారు.

జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వాడేసిన ప్లాస్టిక్‌ను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుందని అన్నారు. వాటిని సేకరించి రీసైకిల్ చేయడం ద్వారా అందమైన గార్డెన్లు, పార్కులు అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. పార్వతీపురాన్ని ప్లాస్టిక్ రహిత, సుందర పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పీవో ఆర్. వైశాలి, మున్సిపల్ కమిషనర్ పావని, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విఎస్ఎస్ చైర్ పర్సన్‌గా శెట్టి మల్లేష్

డుంబ్రిగుడ, మే 17, మనసులో మాట : డుంబ్రిగుడ వన సంరక్షణ సమితి చైర్ పర్సన్ గా శెట్టి. మల్లేశ్వర రావు ని డుంబ్రిగుడ గ్రామస్తులు శనివారం సామాజిక భవనంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం. స్వామి, ఎంపీటీసీ సింహాద్రి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కృష్ణం నాయుడు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఉద్దంగి, రేణుక, వెంకటరాజు ఆధ్వర్యంలో ఏకీభవంగా కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వి ఎస్ ఎస్ చైర్పర్సన్ శెట్టి మల్లేశ్వరరావు మాట్లాడుతూ. వన సంరక్షణ మన అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా వనాన్ని ఉంచాలని చెప్పారు. వన సంరక్షణ కమిటీ చైర్పర్సన్ గా నా శక్తికి మించి ఎటువంటి సమస్య ఉన్న కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లో భాగస్వాములు కావాలి

- ఇంచార్జ్ జోనల్ కమిషనర్ లక్ష్మీ తులసి

అనకాపల్లి రూరల్, మే 16 (మనసులో మాట): ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ- ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఇంచార్జ్ కమిషనర్ డి లక్ష్మీతులసి పిలుపునిచ్చారు. మహా విశాఖ నగర పాలక సంస్థ ప్రధాన కమిషనర్ పిలుపుమేరకు అనకాపల్లి జోన్ లో స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర (సా సా) ప్రోగ్రాంలో భాగంగా ప్లాస్టిక్ రహిత రాష్ట్రం అనే కార్యక్రమం నిర్వహించారు. శనివారం పట్టణంలో ఉన్న అన్ని వార్డ్ లలో (80 84 వ వార్డు లలో) అవగాహన కార్యక్రమము జరిగినవి. ఇందులో భాగంగా 81వ వార్డులో గాంధీ మార్కెట్ లో బండి గాడి వీధిలో కల్కి షాప్ జంక్షన్ దగ్గర అవగాహన కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమము లో అనకాపల్లి జోనల్ కమిషనర్ డి లక్ష్మి తులసి మాట్లాడుతూ అనకాపల్లి జోనల్ పరిధిలో వున్న వర్తకులు, వ్యాపారస్తులు, ట్రేడర్లు, ప్రజలు అందరు సింగల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టిక్ కాలుష్య కారణముగా పర్యావరణ కాలుష్యం జరుగుతున్నదని అందువల్ల సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధించదమైనదని అట్టి సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా ముందుకు వచ్చి, పర్యావరణ కాపాడాలని ఆమె కోరారు. అంతే కాకుండా సింగల్ యుజ్ ప్లాస్టిక్ సంచులు , గ్లాస్ లు , స్పూన్లు, ప్లేట్స్ బదులుగా గుడ్డ సంచులు, నార సంచులు, పేపర్ ప్లేట్ లు , పేపర్ గ్లాసులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమము లో ప్రజలకు అవగాహనా కొరకు ప్లాస్టిక్ రహితంగా తయారుచేసిన వస్తువుల అనగా గుడ్డ సంచులు, నార సంచులు, పేపర్ ప్లేట్ లు , పేపర్ గ్లాసులు , పేపర్ స్పూన్లు, పేపర్ కవర్ లు శ్రీ కల్కి ఎంటర్ ప్రైజెస్ వారి సహకారముతో ప్రదర్శనలో ఏర్పాటుచేసి వివరించారు. అలాగేసాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నూత నిబంధనలు అనుసరించి చెత్తను నాలుగు రకములుగా అనగా తడి, పొడి, హానికర మరియు ఈ వ్యర్థములగా విభజించి మా సిబ్బందికి అందించవలసిందిగా ఆమె కోరారు. రానున్న రోజులో జరుగు స్వచ్ఛ్ సర్వేక్షన్ -2026 లో జి వి యం సి ని దేశములో మొదటి స్తానములో నిలుపుటకు తీసుకొనవలసిన చర్యలు గూర్చి వివరించారు. అనంతరం " స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర (సా సా) " ప్రతిజ్ఞ చేసారు. " స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర (సా సా) " లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు అనకాపల్లి జోన్ లో అన్ని పబ్లిక్ ప్లేస్ లలో అన్ని వార్డులలో ఏర్పాటు చేసినట్టు లక్ష్మీ తులసి తెలిపారు. ఈ కార్యక్రమములో శానిటరీ సూపర్వైజర్ (ఇంచార్జు) రత్తాపు రవి కుమార్, స్వచ్ఛ్ భారత్ ఇంచార్జు దాడి భాస్కరరావు, ఎస్ ఐ ఆదారి సంతోష్ కుమార్, సి హెచ్ గణేష్, సెక్రెటరీలు మోహన్, శ్రీనివాస్, వెంకటేష్, భవాని, సింహాచలం, రాజు, సందీప్, సూపర్వైజర్లు అప్పారావు, నాగేష్, ఇతర పబ్లిక్ హెల్త్ సిబ్బంది, జి వి యం సి సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్, సి ఎన్ జి ధరలు వెంటనే తగ్గించాలి - సిఐటియు

అచ్యుతాపురం మే 16 మనసులో మాట.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై మూడు రూపాయలు కు పైగా పెంచడం దుర్మార్గమని ధరల పెంపు నిరసిస్తూ అచ్యుతాపురం మండల కేంద్రంలో ఆటోకి తాడికట్టి లాగుతూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, అచ్చుతాపురం మండలం కన్వీనర్ కూంద్రపు సోము నాయుడు మాట్లాడుతూ బెంగాల్, కేరళ ,తమిళనాడు ,అస్సాం , పాండిచ్చేరి ఎన్నికల పలితాలు వచ్చిన పది రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం బిజెపి దేశ ప్రజలపై పెట్రోల్ , డీజిల్ ధరలు బారాలను మోపింది కార్పొరేట్లకు కోట్లాది రూపాయలు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం, ప్రజలపై ధరల బారాన్ని విధిస్తోందన్నారు. ధరలు పెంచే ఉద్దేశంతో ముందుగా పొదుపు చర్యలు పేరుతో ప్రజలకు ఉచిత సలహాలు మోడీ ఇచ్చారన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం అంటే ప్రజలను మరింత దరిద్రంలోకి నెట్టడమే అన్నారు. ఇప్పటికే ఉచిత బస్ తో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులపై ధరలు పిడుగుపాటు వంటిదని ఈ ధరలు పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని ఇప్పటికే వంట గ్యాస్ 50 రూపాయలు వాణిజ్య సిలిండర్ పై వెయ్యి రూపాయలు పెంచడంతో చిరు వ్యాపారులు ,హోటల్ యాజమాన్యాలు మూసివేసారని ,ఉపాధి కోల్పోయారని ధరలు నియంత్రించలేని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ప్రజలను గాలికి వదిలేసి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే విధంగా విధానాలు చేపడుతున్నారని ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఆటో, ముఠా కార్మిక సంఘాల నాయకులు యువశక్తి ఆటో స్టాండ్ అధ్యక్షులు కాకి అప్పలరాజు, శ్రీ కనకదుర్గ ఆటో స్టాండ్ అధ్యక్షులు బొండాడ ఆనంద్, శ్రీ మరిడిమాంబ ఆటో స్టాండ్ కార్యదర్శి రంగాల సన్యాసిరావు ,పి శంకర్, వై నూకరాజు, డి త్రినాథ్, డి శ్రీకాంత్, కె రాజు ,ఎస్ రమణ, జె నాయుడు, ఎస్ శివ, కె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ సంఘాల బలోపేతానికి విశాఖ గ్రామీణ సేవా సంఘాల సమాఖ్య కృషి

- నేడు నర్సీపట్నంలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ - నెట్‌వర్క్ కార్యదర్శి జి.టి.వి.ఎస్.ఆర్.కె. రాజు వెల్లడి

నర్సీపట్నం రూరల్, మే 16, (మనసులో మాట).. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న యువజన సంఘాలు, మహిళా సంఘాలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో విశాఖ గ్రామీణ సేవా సంఘాల సమాఖ్య మరియు భారత్ ఎన్ జి ఒ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నర్సీపట్నం రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు నెట్‌వర్క్ కార్యదర్శి జి.టి.వి.ఎస్.ఆర్.కె. రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పనిచేస్తున్న అనేక స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు సరైన మార్గదర్శకత్వం లేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా అందుబాటులో ఉన్న నిధులు, అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించడం ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

సంఘాల నిర్వహణలో పారదర్శకత, సమర్థత పెంపొందించేందుకు అవసరమైన సోసైటీ డాక్యుమెంటేషన్, రిజిస్ట్రేషన్ విధానాలు, వార్షిక నివేదికల తయారీ, ఖాతాల నిర్వహణ, ఫండ్స్ సమీకరణ పద్ధతులు, ప్రాజెక్ట్ ప్రతిపాదనలు తయారు చేసే విధానం వంటి అంశాలపై నిపుణులు వివరణాత్మకంగా చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే సంఘాల్లో చురుకుగా పనిచేసే సభ్యులను ఎగ్జిక్యూటివ్ బాడీలోకి తీసుకోవడం, గ్రామస్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సలహాదారుల కమిటీ ఏర్పాటు ద్వారా సంఘాలను మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి భారత్ ఎన్ జి ఒ ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. యువరాజు ముఖ్య అతిథిగా హాజరై స్వచ్ఛంద సంస్థల అభివృద్ధి, నిధుల సమీకరణ, గ్రామీణ సేవా కార్యక్రమాల విస్తరణపై విలువైన సూచనలు, సలహాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో నెట్‌వర్క్ ఫౌండర్ సి.హెచ్.వి.ఎస్.ఆర్. ప్రసాద్, ప్రెసిడెంట్ ఎస్. నూకరాజు పాల్గొననుండగా, అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి, మన్యం, శ్రీకాకుళం విజయనగరం జిల్లాలకు చెందిన వివిధ యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘాలకు ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయోగకరంగా ఉండబోతుందని, సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి సంఘ ప్రతినిధి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జి.టి.వి.ఎస్.ఆర్.కె. రాజు పిలుపునిచ్చారు.

రైతుల ఆవేదనకు ముగింపు పలకండి : భీశెట్టి

విజయనగరం, మే 16 (మనసులో మాట) : జిందాల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఎస్.కోట మండలం కిల్తంపాలెం, మూల బొడ్డవర, చీడిపాలెం, చినఖండేపల్లి తో పాటుగా అనేక గ్రామాల్లో జరిగిన భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమై 18 సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ భూములు కోల్పోయిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారి సమస్యలకు అధికారులు ముగింపు పలకాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిందాల్ భూ సమస్యల ప్రత్యేక అధికారి కె.ఆర్.సీ.సీ డెప్యూటీ కలెక్టర్ ఈ. మురళిని కోరారు. శనివారం మురళితో సమావేశమై జిందాల్ రైతు సమస్యల పై వివరాలతో కూడిన వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సేకరణలో భాగంగా రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై అమాయక రైతులకు తీరని అన్యాయం చేసారని, ఇందులో అధికార ప్రతిపక్ష పార్టీల నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. జిల్లా అధికారులకు తగిన నిర్ణయం తీసుకోవాలని చాలాసార్లు కోరామని తెలిపారు. గ్రామ సభలు నిర్వహించాలని, ప్రత్యేక రైతు సదస్సులు ఏర్పాటు చేయాలని, షేరుధనం, నిర్వాసితులకు నేటికీ అందని డబ్బులు, తప్పుడు ధ్రువపత్రాలతో డబ్బులు పొందినవారు లాంటి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని జిల్లా యంత్రాంగం పరిష్కరించాలని భీశెట్టి కోరారు. రాజకీయ పార్టీల ఆరోపణలతో అసలు సమస్యలు పక్కకు పోయి రైతులు ఆవేదనతో చనిపోతున్నారని, భూ సేకరణ ఎంతకు జరిగింది, జిందాల్ కి ఎన్ని ఎకరాలు ఇచ్చారో నేటికీ తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకొని జిందాల్ రైతులకు న్యాయం చేయాలని కోరారు.

స్వచ్ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర అవగాహన ర్యాలీ

చిన్న చిన్న మార్పులతోనే గొప్ప ఫలితాలు సాధ్యం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

పార్వతీపురం (సాలూరు)మనసులో మాట జిల్లా ప్రతినిధి , మే 16: స్వచ్ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సాలూరు పట్టణంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని ప్రజల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఇంధనం పొదుపు చేయాలనే ఉద్దేశంతో మంత్రి నడిచి ర్యాలీలో పాల్గొన్నారు. సాలూరు మున్సిపల్ కార్యాలయం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించిన స్వచ్ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర అవగాహన ర్యాలీలో ప్రజలు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గుడ్డ సంచులు, పర్యావరణహిత వస్తువులు వినియోగించాలని సూచించారు. ర్యాలీ సందర్భంగా రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులతో మాట్లాడిన మంత్రి, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని సూచిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. చిన్న చిన్న మార్పులతోనే గొప్ప ఫలితాలు సాధ్యమవుతాయని, స్వచ్ఛత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

నీటిపారుదల అధికారులు, చైర్మన్ లతో సమావేశం అయినా ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం మే 16 మనసులో మాట. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలం ఎస్ టి బి ఎల్ ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ నీటి పారుదల శాఖ అధికారులు,నీటి సంఘాలు చైర్మన్ లతో సమావేశమైన నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గాన్ని దేశం, రాష్ట్రంలోనే అన్ని విభాగాలలో ప్రథమ స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానన్నారు. నీటి సంఘాల చైర్మన్లు వారి వారి పరిధిలో ఉన్నటువంటి నీటి కాలువలు, చెరువులలోను ఎప్పటికప్పుడు పూడిక తీతలను చేపట్టాలన్నారు. త్వరలో గోదావరి జలాలు కూడా మన నియోజకవర్గానికి వచ్చేటందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమకు కేటాయించిన విభాగంలో నూతన పోకడలను అనుసరిస్తూ, ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. నీటి ఎద్దడి రాకుండా , భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేటట్టు వాళ్లు పనులు చేయించు కోవాలని అధికారులతో సమన్వయంగా ఉండాలని సూచించడం జరిగింది. అనంతరం నీటిపారుదల శాఖ అధికారు లు మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు మండలాలకి రూ.2.5 కోట్ల మంజూరయిందని అధికారులు తెలియజేశారు. ఈ రూ.2.5లతో నాలుగు మండలాల్లో పెండింగ్ వర్క్స్ అలాగే కొత్త వర్క్స్ చేయనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, నీటి సంఘాలు చైర్మన్లు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు ప్రతిజ్ఞ

- పేడాడ అధ్యక్షతన తీర్మానం

విజయనగరం, మే 16: (మనసులో మాట).. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాన్ని జనాలకు మరింత అందుబాటులోకి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంఘ సమావేశంలో సభ్యులు తీర్మానించారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం సమావేశం శనివారం నాడు తాత్కాలిక కార్యాలయంలో జరిగింది. సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు వేడాడు జనార్దనరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జనార్దన రావు మాట్లాడుతూ స్వేచ్ఛగా జీవించే హక్కు మనిషికి ఉంటుందని, ఆ హక్కును పరిరక్షించడమే సంఘం ధ్యేయమని అన్నారు. నిరక్షరాస్యత ఇప్పటికీ వేధిస్తున్న సమస్యగా ఉన్న మన దేశంలో హక్కుల పరిరక్షణకు ఇంతటి బలమైన సంఘం ఉందనే సంగతి చాలా మందికి తెలియదు కనుక ముందు సంఘం ఉనికిని, కార్యకలాపాలను ప్రజలకు తెలియజేసే విధంగా సభ్యులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు పిన్నింటి ఎల్లం నాయుడు మాట్లాడుతూ మానవ హక్కుల పరంగా ఎక్కడ ఎవరికి ఏ కష్టం ఉన్నా తాము ఉన్నామనే భరోసా ప్రజల్లో కలుగజేసేందుకు సభ్యులు నిరంతర కృషి చేయాలని కోరారు. సంఘం కోశాధికారి పూజారి భాస్కరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అందరూ చొరవ చూపాలని, అలాగే సమస్యల సంఖ్య పెరిగినప్పుడు పనిని విభజించుకొని అన్ని సమస్యలు పరిష్కారం జరిగేలా సభ్యులు ఒక అవగాహనకు రావాలని సూచించారు. సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు పిఠాపురం ఆదిలక్ష్మి మాట్లాడుతూ కార్యకలాపాల విస్తరణకు తన వంతు కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఈ సమావేశంలో ఇంకా రిటైర్డ్ తహసీల్దార్లు లక్ష్మి..చిన్నయ్య దొర.. జగన్నాథరావు,డాక్టర్ పైడి శివరామకృష్ణ తదితరులు మాట్లాడి సంఘం కార్యకలాపాల విస్తరణకు సూచనలు చేసారు. సభ అనంతరం సభ్యులకు అధ్యక్షుడు పేడాడ జనార్దనరావు జీవితకాల సభ్యత్వ పత్రాలు.. గుర్తింపు కార్డులను అందజేశారు. ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి సంఘ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు.

నిబంధనకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన స్థానికులు

అనకాపల్లి రూరల్, మే 16 (మనసులో మాట): జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ విజయ కృష్ణన్ కు ఫిర్యాదుచేశారు. బిజెపి అనకాపల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ జి శేషు, వి సంతోష్, కొండలరావు, సిహెచ్ గోపి, సన్యాసిరావు తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక ప్రశ్నలో వారు మాట్లాడుతూ అనకాపల్లి జివయంసి నరసింగరావుపేట ప్రాంతంలో జ్యోతి ఎంక్లేవ్ ప్రక్కన, రహదారిలోనే భవన నిర్మాణం జి+1 కి అనుమతి పొందారన్నారు. ఆచరణలోకి వచ్చేసరికి ప్రభుత్వ ఆదాయానికి ఎసర పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా, ఏటువంటి అనుమతి లేకుండా మరొక ఫ్లోర్ నిర్మాణం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిర్యాదుచేయడం చేసామన్నారు. అనంతరం పిర్యాదు పై తీసుకున్న చర్యలు కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయగా జి +1 కి మాత్రమే అనుమతి ఉందని అదనం గా నిర్మిస్తున్న మరొక్క ఫ్లోర్ కి ఏటువంటి అనుమతి లేదన్ని విషయాన్ని రాతపూర్వకశీగా పట్టణ ప్రణాళిక విభాగం వారు సమాధానం ఇచ్చారన్నారు. అయినప్పటికీ భవన యజమాని నిర్మాణం చేస్తున్న విషయాన్ని స్థానిక జోన్ అధికారులకు ఫిర్యాదుచేసామన్నారు.అనధికార ఫ్లోర్ పై టౌన్ ప్లానింగ్ అధికార్లు ఏటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.అనకాపల్లి పట్టణంలో అత్యంత ఖరీదైన నరసింగరావుపేట ప్రాంతంలో నూతన భవన నిర్మాణం యదేచిగా నిర్మిస్తున్న అధికారులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏటువంటి అనుమతి లేకుండా మరొక ఫ్లోర్ నిర్మాణంచేస్తున్నారని, ఈ విషయంపై పిర్యాదు చేయడం జరిగింది. సమస్యను పట్టణ ప్రాణాలిక విభాగం అధికారులకు దృష్టికి కూడా తీసుకు వెళ్ళమన్నారు. వారు స్పందించకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళమన్నారు. బిల్డింగ్ యజమాని సమీపంలో ఉన్న నివాసితులను ఇబ్బందులకు గురిచేయడం జరుగుతుందన్నారు. దక్షిణ వైపు రెండు అడుగుల స్థలం కలుపుకొని వెనకున్న ఎనిమిది కుటుంబాలకు ఎంతో ఇబ్బంది కలిగిస్తూ రహదారిని సుమారు రెండు అడుగులు కలుపుకోవడం జరిగి బిల్డింగు నిర్మాణంచేయటం జరిగింది. తక్షణమే కలెక్టర్ స్పందించి నిర్మాణాన్ని నిలుపుదల చేసి ప్రణాళిక విభాగంపై చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో కోరారు.

ఎంపిఎఫ్‌సి గోదాములను వినియోగంలోకి తేవాలి : జేసీ

విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 16 : బహుళ ప్రయోజన సౌకర్య కేంద్రాలను (ఎంపిఎఫ్‌సి గోదాములు) వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డిఎల్ఐసి) సమావేశం శనివారం జెసి ఛాంబర్‌లో జరిగింది. వ్యవసాయ మౌలిక వసతుల కల్పన కార్యక్రమంలో భాగంగా, జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఎంపిఎఫ్‌సి (మల్టీ పర్పస్ ఫెసిలిటేటింగ్ సెంటర్స్) గోదాముల పరిస్థితి, పెండింగ్ బిల్లులపై ఈ సమావేశంలో జెసి సమీక్షించారు. జిల్లాలో మొత్తం 38 ఎంపిఎఫ్‌సి గోదాముల నిర్మాణాన్ని చేపట్టగా, వీటిలో ఇప్పటివరకు 27 భవనాల నిర్మాణాన్ని పూర్తి చేశామని, ఒకటి వివాదం కారణంగా కోర్టులో ఉండగా, మిగిలిన 10 గోదాములు వివిధ దశల్లో ఉన్నాయని జిల్లా సహకార అధికారి పి.రమేష్ తెలిపారు. మూడు గోదాములు వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, మిగిలినవి 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్నామని తెలిపారు. 500 టన్నుల గోదాము భవనం రూ.40లక్షల వ్యయంతో, వెయ్యి మెట్రిక్ టన్నుల భవనం రూ.80లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనిలో 90 శాతం నాబార్డు రుణం కాగా, మిగిలిన 10 శాతాన్ని రాష్ట్రప్రభుత్వం గ్రాంటుగా మంజూరు చేసిందని వివరించారు. జెసి సేధు మాధవన్ మాట్లాడుతూ, ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 27 భవనాలను ప్రజలకు ఉపయోగపడేవిధంగా వెంటనే వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని చెప్పారు. స్థానిక పరిస్థితులను బట్టి వ్యవసాయ అవసరాలకు అవసరం లేని పక్షంలో ఎవరికైనా లీజుకు ఇచ్చి, ఇతర ప్రజావసరాలకు వినియోగించాలని సూచించారు. ప్రతీ గోదాముకు రహదారి సౌకర్యం, విద్యుత్, నీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. దీనికోసం చిత్తూరు తరహాలో జెడ్‌పి లేదా ఉపాధిహామీ నిధులను వెచ్చించేందుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఆయా శాఖలను సమన్వయం చేసుకొని సదుపాయాలను తక్షణమే కల్పించాలని, నిర్మాణంలో ఉన్న భవనాలకు 3 నెలల్లో పూర్తి చేయించాలని సహకార శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, డ్వామా పిడి శారదాదేవి, నాబార్డు డిడిఎం నాగార్జున, మార్కెటింగ్ ఏడి బి.రవికిరణ్, ఇతర అధికారులు, పిఏసిఎస్ సిఇఓలు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం చలివేంద్రం ప్రారంభించిన పట్టణ ఎస్ఐ

నర్సీపట్నం రూరల్, మే 16, (మనసులో మాట) : ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ రాజ్యసభ సభ్యులు టి జి వెంకటేష్ జన్మదినం సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అభిద్ సెంటర్ లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ ఎస్సై జి ఉమామహేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఇటువంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఎండ తీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు మాట్లాడుతూ, టీజీ వెంకటేష్ జన్మదిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 50 చలివేంద్రాలు ప్రారంభించామన్నారు. రాబోయే కాలంలో ఆర్యవైశ్య సంఘం తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ పద్మనాభుని సోమరాజేశ్వరి, మాజీ అధ్యక్షుడు పెనుగొండ రమేష్, పి ఆర్ ఓ దేవత కామేష్, మండల అధ్యక్షుడు శిరం లక్ష్మణరావు, డాక్టర్ సి ఎస్ కుమార్ దంపతులు, పద్మనాభుని చిన్న కన్నయ్య శెట్టి (చినబాబు) తదితరులు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం.. హర్షాతిరేకాలు వ్యక్తం

విజయనగరం (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 16 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కిడ్నీ బాధిత కుటుంబానికి నాలుగు నెలల్లో ట్రిబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తి చేసి ఇచ్చింది కూటమి ప్రభుత్వం. గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో గతేడాది అక్టోబర్ 1న ఎన్టీఆర్ సామాజిక ఫించన్ పంపిణీ కార్యక్రమం నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి చెప్పిన వివరాలతో గ్రామంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని తీవ్ర ఇబ్బందులు పడుతోన్న పొట్నూరు అప్పలరాజు ఇంటికి వెళ్లిన చంద్రబాబు బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అప్పలరాజు కుటుంబ పరిస్థితిపై ఆరా తీసిన ముఖ్యమంత్రికి గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన సాయంతోనే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. ఇందుకోసం తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమి కూడా అమ్మడంతో పాటు మరికొంత అప్పుకూడా చేశానని.. తన తల్లి రమణమ్మ కిడ్నీ డొనేట్ చేయడంతో ఆమె కూడా పేషెంట్‌గానే ఉన్నారని చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఉండడానికి సొంత ఇళ్లు లేదని బాధితుడు అప్పలరాజు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. అప్పలరాజు పరిస్థితి చూసి చలించిన ముఖ్యమంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ రాం సుందర్ రెడ్డిని పిలిపించి మూడు నెలల వ్యవధిలోనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆదేశించారు. ఇద్దరు ఆడ పిల్లలకు రెండు గదులు, తన తల్లికి మరొక గదితో మొత్తంగా ట్రిపుల్ బెడ్ రూమ్ ఇంటిని నిర్మించి ఇవ్వాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అప్పలరాజుకు 120 రోజుల్లోనే 3 సెంట్ల స్థలం కూడా ప్రభుత్వమే సమకూర్చి రు. 12.50 లక్షలతో ట్రిబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చింది. శుక్రవారం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అప్పలరాజుకు ప్రభుత్వం నిర్మించిన ట్రిబుల్ బెడ్ రూం ఇంటిని ప్రారంభించారు. ముఖ్యమంత్రి గారు మాట ఇచ్చి నాలుగు నెలల్లోనే ట్రిబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వడం... మంత్రి కొండపల్లి ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో పాటు స్వయంగా తమ గృహప్రవేశానికి రావడం తమకు జీవితాంతం భరోసా లభించినట్లైందని అప్పలరాజు కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారితో పాటు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామని అప్పలరాజు కుటుంబ సభ్యులు తెలిపారు.

స్వచ్ఛ రథం ప్రారంభించిన ఎమ్మెల్యే అదితి

విజయనగరం, మే 16 (మనసులో మాట).. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విజయనగరం మండల పరిధిలోని ద్వారపూడి గ్రామంలో "స్వచ్ఛ రథం" ను స్థానిక శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ రథం అనేది ఆంధ్రప్రదేశ్‌లో వ్యర్థాల నుండి సంపదను సృష్టించే ఒక వినూత్న కార్యక్రమం అని తెలిపారు. దీనిలో భాగంగా మొబైల్ వ్యాన్‌లు పొడి గృహ వ్యర్థాలను (ప్లాస్టిక్‌లు, కాగితం, లోహం) సేకరించి, వాటికి బదులుగా కిరాణా సరుకులు, కూరగాయలు, సబ్బులు, స్టేషనరీ వంటి నిత్యావసర వస్తువులను అందిస్తాయని తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించబడిన ఈ "వస్తు మార్పిడి విధానం" యొక్క లక్ష్యం వ్యర్థాలను పారవేయడాన్ని ఆపడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం, 2026 నాటికి ప్లాస్టిక్ రహిత గ్రామాలను సృష్టించడం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు క్విజ్ పోటీలు

పాలకొండ, మే 16, మనసులో మాట : స్థానిక శాఖా గ్రంథాలయంలొ వేసవి విజ్ఞాన శిబిరం 19వ రోజు పిల్లలకు క్విజ్ పోటీలు నూకాల నగేష్ కుమార్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో యోగా గురువు కె. జనార్ధన రావు సూర్య నమస్కారాలు ప్రాక్టీసు చేయించి ఇవి రోజూ సాధన చేస్తే ఆరోగ్యం, ఐశ్వర్యం ఆనందం విజయం ప్రాప్తిస్తుందని శారీరకంగా, మానసికంగా, సమాజ పరంగా ఆధ్యాత్మికంగా ఎదుగుతారని తెలియజేశారు.ప్రతి నెల మూడో శనివారం జరుగుతున్న స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పై పిల్లలకు పరిశుభ్రత " స్వచ్ఛత " పై అవగాహన కల్పించడం జరిగింది వారి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.రిటైర్డ్ టీచర్ మండల వెంకట రమణ పిల్లలకు నీతి కథలు చెప్పడం జరిగింది.స్థానిక గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

చీడికాడ, మే 16, (మనసులో మాట).. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారంనిర్వహించే 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమం మండలంలో జి కొత్తపల్లి గ్రామపంచాయతీలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమం ఎంపీడీవో హేమ సుందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థను అధికారులు పరిశీలించారు.హరిత రాయబారులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఆరుబయట మలవిసర్జన చేయరాదని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అనంతరం అధికారులు, ప్రజలు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా, గ్రామ పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగనవాడి కార్యకర్తలు, ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి శ్రామికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాన్వెంట్ చదువులు వద్దు... ప్రభుత్వ చదువులు ముద్దు

-డిఇఓ అప్పారావు నాయుడు

ఎస్. రాయవరం, మే16,(మనసులో మాట): ప్రభుత్వపాఠశాల్లో ప్రవేట్ పాఠశాలలో కంటె అదనపు సదుపాయాలు ఉన్నాయని, గ్రామీణప్రజలు కాన్వెంట్ చదువులుపై మోజుతగ్గించుకుని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జిల్లావిద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు కోరారు. ఎస్. రాయవరం మండలం జెవిపాలెం, బసవపాడు, పిట్లపాలెం గ్రామాలలో శనివారం స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో డిఇఓ అప్పారావు నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులుతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన విద్యావంతులు చదువు చెబుతారని,ప్రవేట్ పాఠశాలలకు ధీటుగా పదవ తరగతి ఫలితాలు ప్రభుత్వపాఠశాలలో సాధించామని,విద్యార్థులుకు మధ్యాహ్నం భోజనం, అత్యాధునిక టాయిలెట్లు, మంచినీటీ సదుపాయం, ఉచితంగా పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, బ్యాగ్ వంటివి ప్రభుత్వం ఇవ్వటమే కాకుంటా ప్రతివిద్యార్థికి ఏడాదికి తల్లికివందనం క్రింద 15 వేలు రూపాయలు చెల్లిస్తుందని ఆయన అన్నారు. పిల్లలు కుఉచితంగా వైద్యపరీక్షలువంటి అనేక సదుపాయాలు కల్పిస్తున్నందున భరోసాలేని ప్రవేట్ చదువులువద్దని, ప్రభుత్వ పాఠశాలలో తమపిల్లలును చేర్చాలంటూ కరపత్రాలు, అడ్మిషన్ పత్రాలును అందచేసారు. 11 మంది ప్రెవేట్ పాఠశాలల విద్యార్థులును ప్రభుత్వపాఠశాలలో చేర్పించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డి ఇఓ అప్పారావు, ఉపాధ్యాయులు, సిసి వేంకటేశ్వరావు, ఎంఆర్పీపి రమేష్ తదితరులుపాల్గొన్నారు.అనంతరం ఎస్. రాయవరం లో ఏర్పాటుచేసిన హెచ్ ఎంల సమావేశంలో డిఇఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పారావునాయుడు మాట్లాడుతూ ప్రతిపాఠశాల పరిధిలో ఉపాధ్యాలంతాకలిసి గ్రామాల్లో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించాలని, తమపాఠశాలలో పిల్లలుసంఖ్యను పెంచాలని కోరారు. స్థానిక నేతలు సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో పిల్లలునమోదు పెంచుకోవాలని సూచించారు. మండలంలో ని పాఠశాలలహెచ్ ఎంలు ఈసమావేశంలో పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో నేత్ర దానం

పార్వతీపురం(పాలకొండ) మనసులో మాట,మే 16: పాలకొండ పట్టణంలో నివసిస్తున్న వైశ్యరాజు దుర్గారావు, వయస్సు 62 గత 5 సంవత్సరాల నుండి కిడ్నీ వ్యాధి తో బాధపడుతూ, డయాలిసిస్ చేయించుకుంటూ జీవిస్తున్నప్పటికీ గత కొద్దిరోజులగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వ్యాధి తీవ్రతరం అవుతుండడంతో విశాఖ అపోలో ఆసుపత్రిలో జాయిన్ అయి చికిత్స పొందుతూ గురువారం రాత్రి బ్రెయిన్ డెడ్ అవడంతో భార్య,పిల్లలు అవయవదానం చేసి వేరే వ్యక్తిలో మా నాన్నగారిని చూసుకోవచ్చు అని అవయవాలు దానం చేయటానికి ముందుకువచ్చారు. ఇందులో భాగంగా అతని కుమారుడు పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి నేత్ర వైద్య సహాయకులు లక్ష్మణరావు తో సంప్రదించి కళ్ళు దానం చేసే ప్రక్రియ చెయ్యమన్నారు. వెంటనే జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి కి తెలియపరిస్తే వెంటనే విశాఖ లో వున్న ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ తో సంప్రదించి అతని రెండు కార్నియాలు సేకరించి వేరొక ఇద్దరు అంధులకు అమర్చి చూపు తెప్పించే ఘనత అతను భార్య కృష్ణవేణి, పిల్లలకు దక్కిందని అన్నారు. జిల్లాలో ఎవరైనా చనిపోయిన తరువాత నేత్రాలను దానం చేయాలని వారి కుటుంబ సభ్యులు గానీ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ను గానీ, ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రి ని గాని సంప్రదిస్తే నేత్రాలను స్వీకరించే కార్యక్రమం చేపడతారని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా సూర్య కౌశిక్ తెలిపారు.

ఫేలించిన కల.. మాట నిలబెట్టుకున్న మంత్రి కొండపల్లి

విజయనగరం (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 16 : విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలంలో భోజరాజపురం గ్రామస్తుల దశాబ్దాల కలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నెరవేర్చారు. గత ఐదు దశాబ్దాలకు పైగా ఈ గ్రామానికి రాహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామంలో 250 మందికి పైగా జనాభా ఉంటారు. చిన్న గ్రామం కదా ? ఇక్కడ అభివృద్ధి చేస్తే ఎంత... చేయకపోతే ఎంత ? అన్న నిర్లక్ష్యంతో ఈ ప్రాంతంలో ఏళ్ల నుంచి ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులు అందరూ గ్రామంపై పూర్తిగా శీతకన్ను వేశారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికలకు ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ గ్రామానికి రావడం రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడం, శంకుస్థాపన చేయడం... రహదారి కలగానే మిగిలిపోవడం ఆనవాయితీగా వస్తోంది. గత సాధారణ ఎన్నికలకు ముందు సైతం గ్రామస్తులు తమకు రహదారి సౌకర్యం ఐదు దశాబ్దాలుగా లేదంటూ.. పోలింగ్ బహిష్కరిస్తామని చెప్పి ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. చివరికి నాడు ఓ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపల్లి సైతం తాను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తానని మాట ఇచ్చారు. నేడు ఆ మాటను నిలబెట్టుకుంటూ రు. 2 కోట్లతో ఈ రహదారి నిర్మాణం పూర్తిచేసి ప్రారంభోత్సవం చేశారు. కొండపల్లి గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టిలో ఈ రహదారి సమస్య పెట్టడంతో పాటు పదే పదే ఫాలోప్ చేస్తూ పట్టువదలని విక్రమార్కుడిలా రహదారి నిర్మాణం పూర్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా మంత్రి ఈ పని చేయడం పట్ల గ్రామంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. రహదారి నిర్మించిన తర్వాతే గ్రామంలో అడుగుపెడతానని శపథం చేసిన మంత్రి రహదారి ప్రారంభోత్సవానికి వెళ్లగా గ్రామస్తులు మేళతాళాలతో భారీగా స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఐదు దశాబ్దాల తమ కలను మంత్రి శ్రీనివాస్ నెరవేర్చారని, ఇలాంటి పట్టుదల ఉన్న నాయకుడిని ఇన్నేళ్లలో తాము ఎప్పుడూ చూడలేదంటూ గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు. 50 ఏళ్లుగా రహదారి లేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు, ఆవేదన చూశాకే ఈ గ్రామానికి రహదారి నిర్మించాలని నిర్ణయించుకున్నానని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టకుని భోజరాజపురానికి రోడ్డు వేయించడం సంతృప్తిగా ఉందని మంత్రి కొండపల్లి తెలిపారు.

ఆర్టీసీ ఉచిత బస్సు రవాణా సమస్యలపై మహిళలు ఆందోళన

విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 16: ఆర్టీసీ ఉచిత బస్సు రవాణాలో ఎదురవుతున్న వివిధ సమస్యలపై వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో పలువురు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ జనరల్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కోలగట్ల శ్రావణి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ అని చెప్పి చాలా వాగ్దానాలు చేశారని. ఇప్పటి వరకు చాలా పథకాలు అమలు చేయకపోయినప్పటికీ మహిళల కోసం ఉచిత బస్సు పథకం అమలు చేశారని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు పథకం మహిళలకు ఉపయోగపడే విధంగా లేదని, మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా, మహిళలకు కనీస భద్రత కూడా లేకుండా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు పథకం సక్రమంగా అమలు జరగని కారణంగా మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వర్కింగ్ ఉమెన్స్ చాలామంది సమయానికి చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులు సమయానికి కళాశాలకు చేరుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని, కొంతమంది విద్యార్థులు పరీక్షలు కూడా సమయానికి హాజరు కాలేకపోతున్నారని అన్నారు. రోజువారి కూలీ చేసుకున్న వారు సకాలంలో బస్సు సదుపాయం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సకాలంలో బస్సు దొరకలేని కారణంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వికలాంగులు, మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు, చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా బస్సులో ప్రయాణించిన వారికి ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో నిబంధనలను ఉల్లంఘిస్తూ బస్ కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని, దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం సంభవిస్తే వారికి ఇన్సూరెన్స్ వర్తించదని తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో ఆయా కుటుంబ సభ్యులకు ఎటువంటి ఆధారం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబ సమేతంగా దైవదర్శనాలకు వెళ్లాలనుకున్న వారు ఉచిత బస్సు పథకం సక్రమంగా అమలు కాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఉచిత బస్సు పథకం పెట్టారు గాని బస్సుల సంఖ్యను అయితే పెంచలేదు దాని కారణంగా పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన ఉద్యోగుల స్థానాల్లో కొత్తవారితో భర్తీ చేయాలని, గతంలో విజయనగరం నుంచి విశాఖపట్నంకు ఏసీ బస్సు సదుపాయం ఉండేదని, ఇప్పుడు అది లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారుని, ఏసీ బస్సుల సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని, ఉచిత బస్సు పథకం కారణంగా బస్సు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారని, బస్సు సీటింగ్ సామర్థ్యం బట్టి ప్రయాణికులను ఎక్కించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ మహిళా నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యలమంచిలిలో 'ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్' ర్యాలీ - స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసిన అధికారులు

యలమంచిలి మే 16 మనసులో మాట.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యలమంచిలిలో 'ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్' థీమ్‌తో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, మండల తహసీల్దార్ వరహాలు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బందితో కలిసి మున్సిపల్ ఆఫీస్ నుంచి వెజిటబుల్ మార్కెట్ మీదుగా మెయిన్ రోడ్, భవనం వీధి ప్రాంతాల్లో ప్లకార్డులు, నినాదాలతో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం కమిషనర్ ప్రసాదరాజు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి గుడ్డ సంచులు, ఇతర ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ అమ్మినా, వాడినా చట్టప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక వర్తకులు, ప్రజలు, మెప్మా, సచివాలయ సిబ్బందితో మానవహారంగా ఏర్పడి కమిషనర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. 13 సచివాలయాల పరిధిలోని వార్డుల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, తహసీల్దార్ వరహాలు, మున్సిపల్ మేనేజర్ విజయకుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మెప్మా సీఎంఎం పద్మావతి, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది, స్థానిక వర్తకులు, ప్రజలు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిషాంతి టి

పాడేరు రూరల్ మే 16 మనసులో మాట.. పాడేరు మండలం కిండంగి గ్రామంలో ఏర్పాటు చేసిన "చెత్త నుండి సంపద" (వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్) కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిషాంతి టి శనివారం పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణ పారిశుద్ధ్యం మెరుగుదలకు, సేంద్రియ ఎరువుల తయారీలో ఇటువంటి కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, సిపిఆర్ కమిషన్ సీఈఓ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జిసిసి డైరెక్టర్ బొర్ర నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలు

భారీగా సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్య సంఘాలు

అనకాపల్లిరూరల్, మే 16 (మనసులో మాట): పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ జన్మదినం పురస్కరించుకొని అనకాపల్లి పట్టణంలో ఆర్య వైశ్య సంఘాలు ఆధ్వర్యంలో భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. రాయలసీమ టైగర్, మాజీ శాసనసభ్యుల, మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రివర్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు, ప్రముఖ వాణిజ్య పారిశ్రామికవేత్త, టీజీ వెంకటేష్ 76 వ జన్మదిన సందర్భముగా అనకాపల్లిలో ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య మహిళా విభాగం,అనకాపల్లి ఆర్యవైశ్య సభ్యులు పండుగ వాతావరణం లో భారీ ఎత్తున పలు కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగాశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయము,శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయములో అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరము మెయిన్ రోడ్డు మీద భరత్ కుమార్ ప్లాస్టిక్ షాపు దగ్గర భారీ చలివేంద్రములో కూలింగ్ మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు, తదనంతరము ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో గర్భిణీలకు, బాలింతలకు, రోగులకు రొట్టెలు, పాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమములో ఆర్యవైశ్య జిల్లా అనకాపల్లి ప్రెసిడెంట్ ఎలమర్తి నర్సింగ్ రావు, తమ్మన సుబ్రహ్మణ్య గుప్త, గుండా రమేష్ గుప్తా, పుట్టా మోహన్ రావు, కటకం లక్ష్మణ్ రావు, అనకాపల్లి జిల్లా గౌరవ సలహాదారులు, విశ్వ హిందూ పరిషత్ నేత నుదురుపాటి తాతాజీ, జాయింట్ సెక్రెటరీ మల్లేశ్వర రావు, గ్రంధి లావణ్య, కొల్లూరు పూర్ణిమ, తమ్మన లత, శైలజ, నారాయణ, పువ్వాడ భరత్ కుమార్, మాదిశెట్టి భాస్కరరావు, బివి సత్యనారాయణ, కె.వి సత్యనారాయణ, బండారు రాజారావు, బండారు సతీష్, విలేఖరి వాసు, రామారావు, నాచు మల్లికార్జునరావు, కిషోర్, కొల్లూరు కిషోర్, భార్గవ్, నాగమల్ల సీతారాం, నేతి నాగ వరప్రసాద్, పిప్పళ్ళ సత్య, ఎం నాగేశ్వరరావు, జిల్లేడు ముడి ప్రకాష్ , బండారు వీరావతారం, బొర్రా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా బైక్, బంగారు ఆభరణాల దొంగలు ముగ్గురు అరెస్ట్

60,00,000 లక్షల విలువైన 450 గ్రాముల బంగారం , 250 గ్రాముల వెండి సొత్తు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మే16 మనసులో మాట: మునగపాక మండలంలో జరిగిన ఓ దొంగతనం కేసును ఛేదించే క్రమంలో, పక్కా సమాచారంతో అనకాపల్లి జిల్లా పోలీసులు భారీ విజయాన్ని సాధించారు. వివిధ జిల్లాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మోస్ట్ వాంటెడ్ అంతర్ జిల్లా దొంగలను మునగపాక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు 60,00,000/- విలువైన 450 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ తుహీన్ సిన్హా మాట్లాడుతూ గత మే 2వ తేదీన మునగపాక మండలం, వెంకటాపురం గ్రామంలో జరిగిన దొంగతనంపై మునగపాక పోలీస్ స్టేషన్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శనివారం ఉదయం 08:00 గంటల సమయంలో మునగపాక ఎస్సై పి.ప్రసాద రావు కి అందిన నమ్మకమైన సమాచారంతో, సిబ్బందితో కలిసి అనకాపల్లి బైపాస్ రోడ్డు (ఎన్ హెచ్ 16) లక్ష్మీపురం బస్ స్టాప్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఒకే మోటార్ సైకిల్ పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించగా, అలర్ట్ అయిన పోలీస్ సిబ్బంది వారిని వెంబడించి పట్టుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ముగ్గురూ లో పాచిలవానిపాలెం, కె.కోటపాడు, అనకాపల్లి జిల్లా కు చెందిన రొంగలి ప్రసాద్. అక్కయ్యపాలెం, విశాఖపట్నం కు చెందిన ఆటో డ్రైవర్ ఈర్ల వినయ్ కుమార్. (27) పాచిలవానిపాలెం, కె.కోటపాడు, అనకాపల్లి జిల్లా కు చెందిన సిరికి విజయ్ కుమార్ లు ఉన్నారు.వీరు పాత నేరస్తులని వారిపై ఇప్పటికే పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్లు సస్పెక్ట్ షీట్లు ఉన్నట్లు తెలిసింది అన్నారు. నిందితులను లోతుగా విచారించగా మునగపాకతో పాటు ఈ క్రింది పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా తామే దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు అని తెలిపారు: ఎలమంచిలి టౌన్, ఎలమంచిలి రూరల్, రాంబిల్లి, అనకాపల్లి రూరల్, సబ్బవరం, అనకాపల్లి జిల్లా, ఎస్.కోట (విజయనగరం జిల్లా), నాదెండ్ల (గుంటూరు జిల్లా). లో కూడా చేశామని అంగీకరించారు ప్రస్తుతం నిందితుల నుండి 60 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని, వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించడం జరిగింది అన్నారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన పరవాడ సబ్ డివిజన్ ఇంచార్జీ డీఎస్పీ బి.మోహన రావు, యలమంచిలి సర్కిల్ సీఐ ఎస్.ధనుంజయ రావు, రాంబిల్లి సీఐ, సి హెచ్.నర్సింగరావు, అనకాపల్లి సిసిఎస్ సీఐ కె.అప్పలనాయుడు, ఫింగర్ ప్రింట్ ఇన్స్పెక్టర్ టి.విజయ ఎస్సైలు ప్రసాదరావు (మునగపాక), సావిత్రి (ఎలమంచిలి), నాగేంద్ర (రాంబిల్లి), రామకృష్ణ (ఎలమంచిలి ట్రాఫిక్), విశ్వనాథం (సిసిఎస్) సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలను అందజేశారు.

బాక్సింగ్ క్రీడాకారులు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి

క్రీడాకారులకు అండగా ముత్యాల వెంకటేశ్వరరావు(ఎం వి ఆర్) - జాతీయ బాక్సింగ్ పోటీలకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయం

అనకాపల్లిరూరల్, మే 16 (మనసులో మాట): జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి జిల్లాకు బాక్సింగ్ క్రీడాకారులు మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రముఖ సంఘ సేవకులు, పారిశ్రామికవేత్త, బిజెపి రాష్ట్ర నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్) పిలుపునిచ్చారు. శనివారం ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం లో బాక్సింగ్ జాతీయ క్రీడాకారులు ఎం.వి.ఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నేటి బాలలే రేపటిపౌరులు,వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని బిజెపి ముఖ్య నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు ఎం.వి.ఆర్ ఆకాంక్షించారు. ఈ మేరకు, పట్టణంలోని భీముని గుమ్మం ప్రాంతంలో గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్కూల్ నుండి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఎనిమిది మంది క్రీడాకారులకు ఆయన శనివారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఎం వి ఆర్ మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయి నుంచే క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తే, వారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు.క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. సమాజంలో గొప్ప స్థాయిలో నిలబడాలనే పట్టుదల చిన్నతనం నుంచే అలవ డాలని ఎం వి ఆర్ ఆకాంక్షించారు. క్రీడలకు పేరుందిన అనకాపల్లిలో క్రీడలకు క్రీడా అభిమానులకు ఆదరణ ఎక్కువ అన్నారు. క్రీడలతో ప్రభుత్వ ఉద్యోగాలు ఇతర ఉపాధి అవకాశాలు మెండుగాఉంటాయన్నారు.అనంతరం, వారు పోటీల్లో పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని స్వయంగా అందజేసి, వారిని ప్రోత్సహించారు. ఎటువంటి ఆర్థిక ఇబ్బందుల వలన ఏ ఒక్క క్రీడాకారుడి ప్రతిభ ఆగిపోకూడదనేసత్సంకల్పంతోనే తన వంతుగా ఈ ఆర్థిక సహాయాన్ని అందించిస్తునట్లు ఆయన తెలియజేసారు.ఒకే పాఠశాల నుండి ఏకంగా 8 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.మీరందరూ, మీయొక్క విభాగాలలో ఘన విజయం సాధించి, అనకాపల్లికి మంచి కీర్తిని తెచ్చి పెట్టాలని ఆయన ఉద్ఘాటించారు. ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుండే ఎం వి ఆర్ క్రీడాకారుల భవిష్యత్తును కాంక్షిస్తూ అందించిన ఈ ఆర్థిక సహాయం హైస్కూల్ యాజమాన్యం, భీమునిగుమ్మం వాసులు, ఆది ఆంధ్ర యువజన సంఘం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక క్రీడాభిమానులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ పార్కును సందర్శించిన జిల్లా కలెక్టర్

- 'సాసా' కార్యక్రమంలో భాగంగా పర్యవేక్షణ

పార్వతీపురం మనసులో మాట,మే 16 : పట్టణాల రూపురేఖలను మార్చే 'సాసా' కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి శనివారం స్థానిక మునిసిపల్ పార్కును సందర్శించారు. పార్కులో పర్యటించిన ఆయన.. పిల్లల కోసం అక్కడ అందుబాటులో ఉంచిన వివిధ రకాల ఆటల పరికరాలను, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యంగా, వ్యర్థాల నిర్వహణలో భాగంగా పనికిరాని పాత టైర్లను రీసైకిల్ చేసి, సృజనాత్మకంగా రూపొందించిన ఆటల పరికరాలను కలెక్టర్ ప్రత్యేకంగా చూశారు. ఆ టైర్లతో ఏర్పాటు చేసిన వివిధ రైడ్‌లపై పిల్లలు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడుకుంటుండగా కలెక్టర్ కాసేపు అక్కడే ఉండి వారి ఆటలను తిలకించారు. వ్యర్థాలను సైతం పర్యావరణహితంగా, పిల్లలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడంపై అధికారుల ఆలోచనను ఆయన అభినందించారు. పార్కును నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల భద్రతకు ఎక్కడా లోటు లేకుండా ఆట స్థలాలను పర్యవేక్షించాలని మునిసిపల్ అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో మునిసిపల్ కమీషనర్ పావని, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

గంట్యాడలో ఇన్చార్జ్ ఎంపీడీవో రాములమ్మ
స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర

గంట్యాడ (గజపతినగరం), మే 16(మనసులో మాట): గంట్యాడ మండల కేంద్రంలో శనివారం ఇంచార్జ్ ఎంపీడీవో రాములమ్మ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీవో రాములమ్మ మాట్లాడుతూ, గ్రామాలలో ప్రతిరోజు క్రమం తప్పకుండా తడి పొడి చెత్తను సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి ఆమె సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పటిష్టంగా నిర్వహించడానికి అవసరమైన సూచనలు ఇచ్చారు. అనంతరం స్వచ్ఛతపై సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి విశ్వనాథం, వీఆర్వో డెంకాడ రవి, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై పోలీసులు దాడి

పాయకరావుపేట మే 16 మనసులో మాట.. పాయకరావుపేట పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ హెచ్ ఓ సాకేటి శంకర్రావు ఆదేశాలతో పాయకరావుపేట ఎస్ ఐ పురుషోత్తం మరియు సిబ్బంది నామవరం శివారు లేఔట్ లో పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఆరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వీరి వద్ద నుంచి రూ.4170 నగదు మరియు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మెగా జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే అదితి

విజయనగరం, మే 16 (మనసులో మాట) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోటలోని మహారాజా కాలేజీలో నిర్వహించిన "మెగా జాబ్ మేళా"ను విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమం వలన ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆమె తెలిపారు.

కౌలు రైతులకు లబ్ధి చేకూరేలా సీసీఆర్‌సీ కార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి

పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి,మే 16: అర్హులైన కౌలు రైతులందరికీ బ్యాంక్ రుణాలు సకాలంలో అందేలా చూడాలని, సీసీఆర్‌సీ కార్డుల నిర్వహణ మరియు పునరుద్ధరణ ప్రక్రియలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను వెంటనే అధిగమించాలని జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు, రెవెన్యూ శాఖల సమన్వయంతో కౌలు రైతులకు మేలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 134 శాతం వార్షిక క్రెడిట్ ప్లాన్ సాధించిందన్నారు.శనివారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో నిర్వహించిన బ్యాంకర్ల సమీక్షా సమావేశంలో, కౌలు రైతులకు రుణాల పంపిణీ ఆశించిన స్థాయిలో జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధిక సంఖ్యలో దరఖాస్తులు లేదా కార్డులు ఉన్నప్పటికీ, కేవలం కొద్దిమందికి మాత్రమే రుణాలు అందడంపై బ్యాంకర్లను ప్రశ్నించారు.భూమి అసలు యజమాని తాను ప్రస్తుత సంవత్సరానికి గానూ సదరు భూమిపై సాగు హక్కును మరొకరికి బదిలీ చేయడానికి అంగీకరిస్తూ పత్రాలు సమర్పించినప్పుడు, సాంకేతిక కారణాలు చూపకుండా పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. బ్యాంకులు సాధారణంగా పంట ఉత్పాదకత ఆధారంగానే రుణాలు అందిస్తాయని, కాబట్టి కౌలు రైతులకు లోన్లు ఇచ్చేటప్పుడు పంట బీమా వంటి నిబంధనలను సక్రమంగా అమలు చేస్తూనే, అనవసరపు కొలేటరల్ (పూచీకత్తు) ఇబ్బందులు పెట్టకూడదని స్పష్టం చేశారు. అసలు భూ యజమానులు గతంలో తీసుకున్న రుణాల లీన్ మార్కులను పరిశీలిస్తూనే, ప్రస్తుత కౌలుదారుల సీసీఆర్‌సీ కార్డుల ఆధారంగా ఏ సర్వే నంబర్లలో సాగు జరుగుతుందో వెరిఫై చేసుకుని, అర్హులకు రుణాల విస్తరణ చేయాలని ఆదేశించారు. తక్కువ వడ్డీ రేటుకు రుణాలు పొందడం , సకాలంలో చెల్లించి రిబేట్ పొందేందుకు కౌలు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని, కేవలం రిస్క్ ఎక్కువగా ఉంటుందనే నెపంతో రుణాల తిరస్కరణ సరికాదని హితవు పలికారు. ప్రభుత్వాల నుండి అందే ఇన్‌పుట్ సబ్సిడీలు మరియు ఇతర ప్రయోజనాలతో పాటు బ్యాంక్ రుణాలు కూడా కౌలు రైతులకు అందడమే ఈ కార్డుల ప్రధాన ఉద్దేశమన్నారు. కౌలు రైతుల ఆర్థిక బలోపేతానికి ఈ ప్రక్రియను మరింత పారదర్శకంగా మరియు వేగవంతంగా అమలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమీక్షా సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సోమశేఖర్,భారతీయ రిజర్వ్ బ్యాంక్ అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, నాబార్డ్ అధికారులు మరియు జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యం: ఎమ్మెల్యే కోళ్ల

ఎల్.కోట, మే 16: (మనసులో మాట): పరిశుభ్రమైన సమాజంతోనే ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్మాణం సాధ్యమవుతుందని శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన ఎల్.కోట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ఉమ్మడి పారిశుధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్వయంగా చేత పట్టుకుని శ్రమదానం చేశారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసి, ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పూజ్య బాపూజీ కలలు గన్న స్వచ్ఛ భారత్ ఆశయాలను నిజం చేస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. కేవలం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్క పౌరుడు ఈ స్వచ్ఛతా ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు, హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు. నిరంతరం శ్రమిస్తూ గ్రామాలను స్వచ్ఛంగా ఉంచుతున్న సఫాయి మిత్రుల సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆవీజ చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, స్థానిక మండల పరిషత్ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి ప్రభుత్వ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మోదీ ప్రసంగం ప్రజాస్వామ్య దేశంలో ఆంక్షలు ఏంటి?



పాలకొండ, మే16,మనసులో మాట : దైత్య వైఫల్యాలన్ని ప్రజలపై నెట్టివేయడం దూదరీ ఈపా ప్రజలందరూ దేశభక్తిని చాటు కోవాల్సిన సమయం వచ్చిందని పెట్రోల్ వంట నూనెలు వినియోగం తగ్గించాలని చెప్పడం చూస్తే బీజేపీ పెద్దల వైఖరి చూస్తే బనియన్‌మో ఛేధ్ చందంగా ఉందని అభ్యుదయ రైతు, సీనియర్ సిటిజన్ ఖండాపు ప్రసాదరావు తెలిపారు. లోపల బనియన్ ఉన్నా రంధ్రాలు బయటకు కనబడకుండా సూట్‌తో కవర్ చేసినట్టు దేశ ఆర్థిక సంక్షోభాన్ని మోధో పరివారం ఇన్నాళ్లు వికసిత భారత్ పేరిట కవర్ చేస్తున్నారు. దేశ ఆర్థిక స్వాలంబన కోసం సామాన్యలకు పలు సూచనలు చేసిన ప్రధాని, బ్యాంకుల నుంచి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల గురించి ఎందుకు మాట్లాడం లేదని గడిచిన 12 ఏళ్లు రూ.10 లక్షల కోట్లును రైటాప్ చేసిన విషయాన్ని ఈ మేరకు ప్రస్తావిస్తున్నారు. జీఎస్‌టీ, వ్యాట్, వర్సెజ్, ఇన్‌కమ్, క్యాపిటల్ గెయిన్ టాక్స్, ఇలా గడచిన 12 ఏళ్లలో సామాన్యులపై మోదీ సర్కారు పన్నుపోటుకు తెగబడిందని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటి వరకు వివిధ పన్నుల రూపంలో కేంద్ర ఖజానాకు 350 కోట్లు చేరినట్టు అంచనాలు వేస్తున్నారు. ఇదే సమయంలో రుణాల పేరిట ఒక్కో దేశ పేదొడిపై మోదీ సర్కారు రూ.1.48 లక్షలను అప్పగా చేసింది. అలా దేశ అప్పులు రూ.208 కోట్లకు చేరుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇన్ని వైఫల్యాలను కప్పుకొని ప్రధాని మోదీ ఇప్పుడు దేశ ఆర్థికంపై సామాన్యులకు హిత బోధర చేస్తున్నారు. బంగారం కొనవద్దని, విదేశీ టూర్లకు వెల్లవద్దని, వంటనూనె తగ్గించాలని మోదీ చేసిన సూచనలు నియంత్రత్వానికి పరాకష్ఠగా మారాయి. ఇవే సూచనలు ఆదానీ, అంబానీలకు మోదీ చెప్పగలరా? కరువు తాండవించినప్పుడు వంద బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన ఆదానీ, అంబానీలు దేశ ఆర్థిక సామానికి సాయపడి తమ దేశ భక్తిని చాటుకోవచ్చు కదా ఈ దిశగా ప్రదాని వారికి ఎందుకు విజ్ఞప్తి చేయడం లేదు. దీనినే బనియన్‌మే చేదీ చందంగా ఉందని సీనియర్ సిటిజన్ ప్రసాదరావు ఎద్దేవా చేశారు.

సుదీక్ష విద్యార్థులు అద్భుత ప్రతిభ

గాజువాక (మనసులోమాట) మే 16.. సి బి ఎస్ ఈ 12వ తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. గాజువాక కూర్మన్నపాలెం ప్రాంతంలో గల సుదీక్ష విద్యార్థులు అద్భుతమైన పర్సంటేజ్ సాధించి తన సత్తా చాటారు. ఏ.శామ్యూల్ మన్న, డి. శ్రీ హాసిని, ఆర్.శైలేష్ కుమార్,పి.మిశాంత్, పి.వర్షిని, టి.ఇషిత, పి.గాయత్రి 90 పర్సంటేజ్ పైగా మార్కులు సాధించారు.16 మంది విద్యార్థులు 80 పర్సంటేజ్ పైగా 20 మంది విద్యార్థులు 75 పర్సంటేజ్ పైగా సాధించి తమదైన ప్రతిభ చూపించారు. కళాశాల ఫౌండర్ అండ్ చైర్మన్ అప్పలనాయుడు విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే విడుదలైన ఆల్ ఇండియా మెయిన్స్ లో సుదీక్ష విద్యార్థి శామ్యూల్ మన్నారెడ్డి 210 ర్యాంక్ సాధించగా 20 మందికి పైగా విద్యార్థులు 90 పర్సంటేల్ పైగా సాధించి సుదీక్ష సత్తా చాటారని అన్నారు. నేడు 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో మా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని అన్నారు. సుదీక్ష లో చేర్పించిన విద్యార్థులు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధారాణి, ఏజీఎం రామశంకర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కౌశలం ద్వారా యువతకు ఉపాధి

జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్

విజయనగరం (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 16 : ప్రభుత్వం ప్రారంభించిన కౌశలం కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. కౌశలం కార్యక్రమం అమలుపై రాష్ట్ర ఐటి సెక్రటరీ కాటంనేని భాస్కర్ అమరావతి నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విసిలో జిల్లా తరపున జెసి పాల్గొని కార్యక్రమం అమలును వివరించారు. ఆయన జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, యువతకు వివిధ ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు కౌశలం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పది, ఆపై తరగతులు ఉత్తీర్ణులైన వారంతా ఉపాధి కోసం కౌశలం వెబ్ పోర్టల్‌లో లేదా, స్వర్ణ గ్రామం(సచివాలయం)లో తమ పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. వీరికి స్వర్ణగ్రామంలోనే స్కిల్ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించ బడుతుందన్నారు. నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా, పరీక్ష ఉత్తీర్ణులైన వారి పేర్లను వివిధ ప్రయివేటు సంస్థలకు పంపిస్తామని తెలిపారు. ఇటీవల జిల్లానుంచి 267 మందిని పంపించగా, ఇంటర్వ్యూలో అత్యధికంగా బజాజ్, హెటిరో సంస్థలకు 210 మంది ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ నెల 18న విశాఖపట్నంలో ఐదు సంస్థలు నిర్వహించే జాబ్ మేళాకు మరింత మందిని పంపిస్తున్నామని తెలిపారు. కౌశలం కార్యక్రమం గురించి ఇతర వివరాలకు జిల్లా స్థాయిలో 9154409721 కు ఫోన్ చేయాలని జెసి సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఈఓ ఇ.నాగలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంప్లాయిమెంట్ అధికారిణి ఆర్ ఎస్ మెస్సీ ఇవాంజలీన్, స్వర్ణగ్రామం జిల్లా ఇన్‌ఛార్జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ వికాస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్

పాయకరావుపేట మే 16 మనసులో మాట. పాయకరావుపేట పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ వికాస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొని పంచాయితీ కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించారు.వారికి నిత్య అవసర సరుకులను అందజేశారు.అనంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చించలపు ప్రదీప్,పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ళ వరహాలు బాబు, మజ్జూరి నారాయణరావు, కంకిపాటి వెంకటేశ్వరరావు, గూటూరు శ్రీను, మలిపెద్ది వెంకటరమణ,జూరెడ్డి ప్రసాద్,మండల తెలుగు యువత అధ్యక్షులు గొల్లపల్లి నాగు, చిరుకూరు పేర్రాజు, ఐటిడిపి బొలిశెట్టి నాగేశ్వరరావు, చొక్కా కృష్ణ, ఎంపీడీవో లవరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అందరి లక్ష్యం కావాలి

గొట్లాంలో జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు

బొండపల్లి (గజపతినగరం), మే 16 (మనసులో మాట): స్వచ్ఛ ఆంధ్ర అందరి లక్ష్యం కావాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని శనివారం బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి డి మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. గొట్లాం పంచాయతీలో బొండపల్లి ఎంపీడీవో రఘుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డి మల్లికార్జునరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డిపిఓ మల్లికార్జునరావు సందర్శించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మి కంపోస్ట్ పిట్స్ లో వానపాములను విడుదల చేశారు. తడి పొడి చెత్తను పక్కాగా సేకరించే విధానం, చెత్త నుంచి సంపద సృష్టించే విధానం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పద్ధతులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.. అనంతరం డిపిఓ మల్లికార్జునరావు మొక్కలు నాటారు. అలాగే స్వచ్ఛతపై సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్, గ్రామ పెద్దలు విజయనగరం డిపిఆర్సి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సతీష్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడలో జాతీయ డెంగ్యూ దినోత్సవం పై ర్యాలీ, ప్రతిజ్ఞ

- పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో

గంట్యాడ, (గజపతినగరం), మే 16:. గంట్యాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ, ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత మాట్లాడుతూ, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని తద్వారా దోమల వృద్ధి తగ్గుతుందన్నారు.

ప్రతి శుక్రవారం ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల కీటక జనీత వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చు అని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సాగునీటి సంఘం నూతన పాలకవర్గం

ఎల్.కోట, మే 16:(మనుసులో మాట): విజయనగరం జిల్లా జామి మండలం, కలగాడ గ్రామానికి చెందిన సాంబయ్యపాలెం గెడ్డచెరువు సాగునీటి సంఘం ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చప్ప రామకృష్ణతో పాటు కమిటీ సభ్యులు గేదెల సత్యారావు, మాతల పెద్ది నాయుడు, కిలపర్తి చంద్ర నాయుడు, రాయవరపు సత్యనారాయణ, గేదెల దేముడు శనివారం ఎల్.కోట మండల కేంద్రంలోని కూటమి ప్రభుత్వ క్యాంప్ కార్యాలయంలో ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నూతన అధ్యక్షుడికి, సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాగునీటి సంఘం ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి కావడం హర్షణీయమన్నారు. వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, నూతన పాలకవర్గం కూడా అదే బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సాంబయ్యపాలెం గెడ్డచెరువు పరిధిలోని రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, చివరి ఆయకట్టు వరకు నీరందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. నియోజకవర్గంలోని సాగునీటి వనరుల అభివృద్ధికి, రైతాంగానికి అవసరమైన ప్రతి సదుపాయాన్ని కల్పించేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నూతన పాలకవర్గ సభ్యులతో పాటు జామి మండలానికి చెందిన ముఖ్య కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

అగనంపూడి లో టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలు

భారీగా సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్య సంఘాలు

పరవాడ, మే 16 (మనసులో మాట): పారిశ్రామికవేత్త, మాజీ మంత్రి టీజీ వెంకటేష్ జన్మదినోత్సవ సందర్భంగా అగనంపూడి లో ఆర్య వైశ్య సంఘాలు ఆధ్వర్యంలో భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. రాయలసీమ టైగర్, మాజీ శాసనసభ్యుల, మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రివర్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు, ప్రముఖ వాణిజ్య పారిశ్రామికవేత్త, టీజీ వెంకటేష్ 76 వ జన్మదిన సందర్భముగా , వాసవి క్లబ్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు.శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం,శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయములో అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరము అగనంపూడి ప్రభుత్వ ఆసుపత్రి నందు రాష్ట్ర మహాసభ కోఆర్డినేటర్ కారుమూరు మహేష్, ఉపాధ్యక్షులు జి. రఘునాథ్ గుప్తా , జిల్లా సంఘం సభ్యులు బెల్లాల పెంటబాబు అప్పల సత్యనారాయణ సేవా ట్రస్ట్ చైర్మన్ వరద కృష్ణ ,ఉడా సత్యనారాయణ (బుజ్జి), గర్భిణీలకు, బాలింతలకు, రోగులకు రొట్టెలు, పాలు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్

ఎలమంచిలి టౌన్, మే16,మనసులో మాట.. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంల ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ప్రతి నెల మూడో శనివారం జరిగే కార్యక్రమంలో మే నెల థీమ్ అయినటువంటి ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే అంశంపై స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం లో స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు, మండల తహసిల్దార్ వరహాలు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ ఆఫీస్ నుంచి వెజిటబుల్ మార్కెట్ మీదుగా మెయిన్ రోడ్ మరియు భవనం వీధి ప్రాంతాలలో ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే కార్యక్రమం పై అవగాహన ర్యాలీ ను ప్లకార్డ్స్ మరియు స్లోగన్లతో చేపట్టడం జరిగింది. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అమలులో సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నిషేధించి గుడ్డ సంచులను ఇతర ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు ప్లాస్టిక్ ను అమ్మినా మరియు వినియోగించిన కూడా చట్టరీత్యా జరిమానాలు విధించబడతాయ ని తెలియజేశారు. అనంతరం మానవహారం గా ఏర్పడి అక్కడి స్థానిక వర్తకులు , ప్రజలు మెప్మా సిబ్బంది , సచివాలయ సిబ్బంది చే కమిషనర్ గారు స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించడం జరిగింది.

అనంతరం 13 సచివాలయాల పరిధిలో ఉన్న వార్డులలో పై పేర్కొన్న అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో.మున్సిపల్ మేనేజర్ విజయకుమార్ గారు, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు,మెప్మా సి ఎం ఎం పద్మావతి ,మెప్మా సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది స్థానిక వర్తకులు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ డెంగ్యూ దినోత్సవం ప్రతిజ్ఞ అవగాహన సదస్సు

- ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి సురిశెట్టి శ్రీనివాస్

మునగపాక, మే 16, మనసులో మాట.. ప్రతి సంవత్సరం మే 16 తేదీన "జాతీయ డెంగ్యూ దినోత్సవం" జరుపుకుంటున్నామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ దోమ మంచినీటి నిల్వలలో మాత్రమే గుడ్లు పెడుతుందని, ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు,కీళ్ళ నొప్పులు, కళ్ళు నొప్పులు, కంటి కదలిక తగ్గటం మరియు నొప్పి, ఒక్కొక్కసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ళ నుండి రక్తస్రావం అధిక దాహం, నోరు ఎండిపోవడం వంటివి దీని లక్షణాలు అని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడ ఏడిస్ ఈజిప్టై దోమకాటు ద్వారా ఈ వ్యాధి వస్తుందని, ఈ జాతి దోమ పైన నల్లని, తెల్లని చారలు ఉండుటవలన దీనిని టైగర్ దోమ అనికూడా పిలుస్తారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటాయి. పగటిపూట మాత్రమే కుడతాయి.ఇవి ఎక్కువ దూరం ఎగరలేవు. అన్ని రకాల దోమలకంటే ఈ దోమ చాలా బరువైనది.డెంగ్యూ వైరస్ తో ఇన్ఫెక్ట్ అయిన దోమలోనే కాకుండా దోమ గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది. కాబట్టి త్వరితగతిన ఎక్కువ మందికి వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుందని తెలిపారు ఆరోగ్య బోధకులు ఏ రామలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో ప్రమాదం ఎక్కువ. కాబట్టి త్వరితగతిన చికిత్స చేయించుకోవాలని.ఇంటి లోపల మరియు ఇంటి ఆవరణలో ఎక్కడా మూతలేకుండా కొద్దిగా నీళ్ళుకూడా నిల్వ ఉండకూడదు.ఉదాహరణకు పూలకుండీల క్రింద, పెంకులు, కొబ్బరిబోండాలు,రుబ్బురోళ్ళు, పనికిరాని వస్తువులు, పాతటైర్లు, తాగి పడేసిన టీ కప్పులు, సీసాలు, , నీటి ట్యాంకులు, సంప్ లు, కూలర్లు, నీటి గుంటలు మొదలగునవి ఇంటి చుట్టుపక్కల ఉండకూడదని,

ఇంటిలో నీరు నిల్వలు ఉన్న పాత్రలపైన మూతలు పెట్టాలని పిలుపునిచ్చారు. హెల్త్ సూపర్వైజర్ సునీత మాట్లాడుతూ వారానికి ఒకసారి అన్ని నీటి నిల్వలను పారపోసి, పాత్రలను శుభ్రంగా తుడిచి పెట్టుకోవాలని, ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" పాటించాలి. ఇళ్ళు మరియు ఆవరణ ప్రతిరోజూ ఉదయం సాయంత్రం శుభ్రపరుచుకోవాలి.డెంగీ అని అనుమానం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని, దోమలు పుట్టకుండా కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, దోమకాటు ఆరోగ్యానికి చేటు. కనుక సమాజంలో ప్రతి ఒక్కరూ దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశీలించడం, శుభ్రం చేయడం, మూత పెట్టడం అనే మూడు పద్ధతుల ద్వారా డెంగ్యూని ఓడించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, పి.హెచ్.సి. సిబ్బంది లక్ష్మి,నాగేశ్వరరావు, జగన్నాథరావు, రవికుమార్, రమణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన డిజైర్ సొసైటీ సమ్మర్ క్యాంప్

- ఇందనం ఆదా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత- బిజేపి నేత కేఎన్ఆర్

గాజువాక (మనసులోమాట)మే 16.. గాజువాక శ్రీనగర్ అఫిషియల్ కోలనీలో ఉన్న డిజైన్ సొసైటీ హెచ్.ఐ.వి బాదిత పిల్లల హాస్టల్ ప్రాంగణంలో సమ్మర్ క్యాంప్ 2026 ప్రారంభం అయింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ మరియు గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న వేసవి శిభిరంలో విధ్యార్థులు అందరూ పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. డిజైర్ సొసైటీ వ్యవస్థాపకులు రవిబాబు సేవలను కొనియాడారు. దేశంలో పూనే, హైదరాబాద్, బెంగుళూరు,డిల్లీ, విశాఖపట్నం వంటి ఐదు నగరాల్లో 1500 మంది హెచ్.ఐవి బాదిత పిల్లలకు ఉచితంగా పౌష్టికాహారం ,వసతి ,చదువు, వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ప్రదాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఇంధనం ఆదా చేయాలని, డీజిల్, పెట్రోల్ కి బదులుగా ఎలక్ట్రికల్ వాహనాలు వాడాలని కోరారు. బంగారు కొనడం ద్వారా విదేశీ మారక ద్రవ్యం భారీగా విదేశాలకు వెళ్తుందని అందుకే సంవత్సరం వరకు బంగారం కొనుగోలు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుదీర్ రెడ్డి,వీరయ్య, యూట్యూబర్ నిషిత ,శరత్,డాక్టర్ సురేష్ , లక్ష్మణ , చంద్రశేఖర్, సుభాష్, సూర్యనారాయణ, నీలిమ, యామిని తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి శనీశ్వర జయంతి సందర్భంగా మహాభిషేకం - అన్న ప్రసాద వితరణ

గాజువాక(మనసులోమాట)మే 16 .. జీవీఎంసీ పరిధి 65వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలభైరవ స్వామి శనీశ్వర జయంతి మరియు అమావాస్య ఓకే సందర్భంగా మహాభిషేకం ప్రత్యేక హోమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు. మరియు అన్నప్రసాద వితరణ పండురి రాము శ్రీమతి అరుణ దంపతుల కుమార్తె నీరజ లావణ్య పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయం అన్న ప్రసాద్ వితరణ జరిగినది.ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈరోజు గ్రంథ అమావాస్య పితృదేవతలకు అత్యంత ప్రీతిపదమైన అమావాస్య కాలభైరవుడికి అభిషేకం హోమంలు చేయడం జరిగిందని దీనివల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాల బైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శు భదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. పూజా కార్యక్రమం రాఘవేంద్ర శర్మ సారిద్యంలో నిర్వహించారు.ప్రతి శనివారం అన్నమయ్య కీర్తనలు ఆలోచిస్తున్నా లాభాల దుర్గాప్రసాద్ భవాని దంపతులు గీతా ఆలాపన చేశారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాజు, కోదండరాంఏం.ఎస్.రామక్రిష్ణ దంపతులు విజయ నాయక్,హరికృష్ణ,బి.వెంకటేష్ ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు.

డెంగూ అవగాహన ర్యాలీ

విజయనగరం, మే 16 (మనసులో మాట) :
జాతీయ డెంగూ దినోత్సవం సందర్భంగా శనివారం విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. జీవన రాణి ఆధ్వర్యంలో స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగూ నిర్మూలన కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా జీవన రాణి మాట్లాడుతూ డెంగూ నివారణలో ప్రజల అవగాహన, త్వరిత నిర్ధారణ, సమయానికి చికిత్స ఎంతో కీలకమని తెలిపారు. దోమల పెరుగుదలను నియంత్రించడం కోసం పరిసరాలను శుభ్రంగా ఉంచడం, దోమతెరలు ఉపయోగించడం, డెంగూ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని సూచించారు. జిల్లా మలేరియా అధికారి వి.ఎస్.కె. రఘు వంశీ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న డెంగూ నియంత్రణ కార్యక్రమాలను వివరించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని, డెంగూ నివారణకు సరైన పద్ధతులను పాటించాలని సూచించారు. దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ ధరల పెంపుపై సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

గజపతినగరం, మే 16 (మనసులో మాట): కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచడంపై శనివారం నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు. సిపిఐ జిల్లా నాయకులు పురం అప్పారావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచి సామాన్యులపై పెను భారం మోపిందని ఆరోపించారు. గ్యాస్ ధరలు కూడా విపరీతంగా పెంచడంపై నిరసన తెలియజేశారు. కార్మిక నాయకులు పాల్గొన్నారు.

మునగపాక శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి విరాళం



మునగపాక, మే 16, మనసులో మాట.. మండల కేంద్రం మునగపాక శ్రీ వేంకటేశ్వర స్వామి గుడి నిర్మాణం నిమిత్తం ఉమ్మాలాడ వాస్తవ్యులు కీర్తిశేషులు కాంద్రేగుల నారాయణమూర్తి అచ్చియమ్మ జ్ఞాపకార్థం వీరి కుమారుడు అప్పారావు వెంకటలక్ష్మి దంపతులు =o.50,116/- రూపాయలు విరాళం ఇవ్వడం జరిగినది. వారికి వారి కుటుంబానికి శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, మునగపాక ఎంపీపీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరు నాయుడు, సూరిశెట్టి రాము, పెంటకోట జగన్నాథరావు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో జెడ్.పి. ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాస రావు

విజయనగరం (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 16 : జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘముల సమావేశం జరిగింది. ఈ సమవేశంలో వ్యవసాయం , ఉపాధి హామీ, హౌసింగ్, డి.ఆర్.డి.ఏ , ఐ.సి.డి.ఎస్ పై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ జిల్లాలోని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. అందులో భాగంగా ముందుగా డి ఆర్ డి ఏ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అందులోని స్వయం సహాయక సంఘాల పనితీరు,అప్పుల గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రభుత్వం కొత్త పింఛన్లను ఎప్పటి నుంచి ఇస్తుంది అని తెలుసుకున్నారు. రాబోయే సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, సాగునీటి విడుదలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన రైతులు నష్టపోతున్నారని త్వరగా ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. తర్వాత సివిల్ సప్లై శాఖ ను సమీక్షిస్తూ ఇంకను రైతులకు ఇవ్వాల్సిన ఆర్థికపరమైన లావాదేవీలు గురించి మరియు గోనే సంచులకు చెల్లించాల్సిన పైకము గురించి చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా వాటికి చెల్లింపులు చేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్ల నిర్మాణం మరియు ఉపాధి హామీ పనుల పురోగతిపై కమిటీ సమీక్షించింది. పనుల్లో నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ పనుల్లో ఈ వేసవికాలంలో నాలుగు మరణాలు సంభవించాయని అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఉపాధి హామీ కూలీలకు పని చేసే చోట నీడ ,తాగునీరు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హౌసింగ్ పై సమీక్ష చేస్తూ ఎన్ని గృహప్రవేశాలు చేయించింది కొత్తగా ఇవ్వబోతున్న ఇళ్ల వివరాలు కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ఇ.నాగలక్ష్మి వివిధ మండలాల జడ్పిటిసిలు, ప్రజాప్రతినిధులు , అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జాతర వేళ భక్తుల భద్రతే లక్ష్యం - రవాణా శాఖ హెచ్చరిక

జాతర సందర్భంగా అధిక చార్జీలు వసూలు చేస్తే శాఖ పర్యమైనా చర్యలు తప్పవు

-జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి రమేష్

పాడేరు రూరల్ (హుకుంపేట) మే 16 మనసులో మాట.. పాడేరు శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి అమ్మవారి జాతర మే 17, 18, 19 తేదీల్లో వైభవంగా జరగనున్న నేపథ్యంలో భక్తుల రాకపోకలు భారీగా పెరగనున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా రవాణా శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసిందని జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి రమేష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సమయంలో కొంతమంది వాహనదారులు అధిక లాభాల కోసం జీపులు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, అధిక చార్జీలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తుల ప్రాణాలకు ముప్పు కలగకుండా వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని, అందువల్ల డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై మోటార్ వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జాతరకు వచ్చే భక్తులు కూడా అధిక ప్రయాణికులతో నిండిన వాహనాల్లో ప్రయాణించకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మోదకొండమ్మ జాతరకు భారీ బందోబస్తు

- 700 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత : ఎస్పీ అమిత్ బర్దర్

పాడేరు రూరల్, మే 16 మనసులో మాట.. పాడేరు శ్రీ మోదమ్మాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు మే 17 నుంచి 19 వరకు జరగనున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ శనివారం తెలిపారు. పోలీస్ శాఖ కమిటీ ఆధ్వర్యంలో మోదకొండమ్మ అమ్మవారి ప్రాణంగాణంలో సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతరకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నందున శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొత్తం 700 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు నియమించాం. రెండు శక్తి టీములు, మూడు డ్రోన్ టీములు, ప్రత్యేక క్రైమ్ పార్టీలు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తాయి. జనసమ్మర్ధ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా కొనసాగిస్తాం" అని తెలిపారు. జాతర సందర్భంగా మే 16 నుంచే పాడేరు పట్టణంలోకి భారీ వాహనాలు, సరుకు రవాణా వాహనాల ప్రవేశాన్ని నిషేధించినట్లు చెప్పారు. జాతర మూడు రోజులలో ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల తర్వాత పట్టణంలోకి ఇతర వాహనాలను కూడా అనుమతించబోమన్నారు. ట్రాఫిక్ దారి మళ్లింపులపై ఎస్పీ వివరాలు వెల్లడిస్తూ విశాఖపట్నం నుంచి వచ్చే వాహనాలను అరకు సుంకరమెట్ట జి.మాడుగుల మార్గం వైపు మళ్లిస్తున్నామని తెలిపారు. అరకు వైపు నుంచి వచ్చే వాహనాలను చింతపల్లి లంబసింగి మార్గంలో పంపిస్తున్నామని చెప్పారు. జి.మాడుగుల, హుకుంపేట ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. "మహిళలు, పిల్లలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, మద్యం సేవించి అల్లరి చేయడం వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లో సహించము. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఎస్పీ హెచ్చరించారు. శ్రీ మోదమ్మాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, వాహనదారులు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ అమిత్ బర్దర్ విజ్ఞప్తి చేశారు.

పూసేలి గ్రామంలో నెలకొన్నదాహార్తి సమస్య వెంటనే పరిష్కరించాలి

అరకులోయ,మే 16 (మనసులో మాట): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం మారుమూల బస్కి పంచాయితీ పూసేలి గ్రామంలో ఎదుర్కొంటున్న మంచినీటి మరియు రోడ్డు సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని గ్రామంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్కి (సిపిఎం) మాజీ ఎంపిటిసి బురిడీ దశరథ్ మాట్లాడుతూ పూసేలి గ్రామంలో 2010 లో నిర్మించిన మంచినీటి కుండి మరమ్మతుకు గురై వేసవి తాకిడికి ఎండిపోవడంతో పొలంలోని బురద నీరే త్రాగే పరిస్థితి నెలకొని ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పూసేలి గ్రామంలో ఎదుర్కొంటున్న మంచినీటి మరియు రోడ్డు సౌకర్యముపై గత ఏడాది పాడేరు స్పందన మీకోసం కార్యక్రమంలో గ్రామస్తులతోకలసిముక్కుమ్మడిగా వెళ్లి ఫిర్యాదు చేయగా అందుకుతారు రోడ్డు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి రోడ్డు కోత గురై ప్రమాద భరితంగా మారడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా పూసేలి గ్రామంలో నెలకొన్న మంచినీటి మరియు రోడ్డు సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని లేని పక్షమున బస్కి పంచాయితీ సచివాలయ కార్యాలయంలో ఆందోళన ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామనిదశరద్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కొర్ర మార్కెండ్ రావు, పెసా అధ్యక్షులు పాంగిబోదన్న, వంతల సుందర్రావు, గున్నమ్మ, శాంతి, అప్పారావు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి దేవస్థానంలో శ్రీ శనీశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు

- శ్రీకాళహస్తి బోర్డు డైరెక్టర్ బిలా స్రవంతి

మునగపాక, మే 16, మనసులో మాట.. సన్నీ జయంతి శ్రీ కాళహస్తి దేవస్థానంలో శ్రీ శనీశ్వర స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు పూజలు నిర్వహించడం జరిగిందని శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు డైరెక్టర్ బీలా స్రవంతి తెలిపారు. ఈ పూజల్లో శ్రీకాళహస్తి నియోజవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారని స్రవంతి తెలిపారు. అమావాస్య రోజు శ్రీ శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈనెల 19న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

15 ప్రముఖ కంపెనీల ఉద్యోగాల నియామకానికి సన్నద్ధం

నర్సీపట్నం రూరల్, మే 16, (మనసులో మాట) : నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నక్కపల్లి ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ లో ఈనెల 19న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఎన్ గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదవ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఐటిఐ, డిప్లొమా విద్యార్హత కలిగిన 18 నుండి 40 సంవత్సరముల వయసు గల స్త్రీ, పురుషులు అర్హులని ఆయన తెలిపారు. ఈ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను నైపుణ్యం వెబ్ సైట్ naipunyam. ap. gov. in నందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 19వ తేది ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ నంబర్ తో పాటు తమ ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ లు, రెజ్యూమ్ తో నక్కపల్లి లోని ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్ వద్ద హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 8247505171 నంబరును ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

బొత్సకు బ్యాడ్ డేస్..!?

విజయనగరం, మే 16: (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి).. అది 1999.. ఇన్నాళ్లు ఒక లెక్క.. ఇప్పుడో లెక్క.. అన్నట్టు విజయనగరం జిల్లా రాజకీయాల్లో పెను మార్పుకి శ్రీకారం జరిగిన సందర్భం..

బొత్స సత్తిబాబు అనే వ్యక్తి 1999 లో జరిగిన జమిలి ఎన్నికల్లో బొబ్బిలి పార్లమెంట్ స్థానం నుంచి గెలిచి విజయనగరం జిల్లా అనే కాదు..ఉత్తరాంధ్ర.. ఆమాటకొస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనే అనూహ్యమైన మార్పులకు నాంది పలికారు.

అప్పటికి అదే బొబ్బిలి పార్లమెంట్ స్థానం నుంచి వరసగా రెండు పరాజయాల తర్వాత 1999లో అది మూడో ప్రయత్నం..వైఎస్సార్ బలవంతంపై తప్పనిసరి పరిస్థితుల్లో..గెలుపుపై అస్సలు నమ్మకమే లేని స్థితిలో పోటీ..

కట్ చేస్తే..ఫలితాలు వచ్చేపాటికి ఊహించని విజయం..సత్తిబాబు ఎంపీగా గెలవడం మాత్రమే గాక జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం.. అలా సత్తిబాబు రాష్ట్ర రాజకీయ యవనికపై తన ఎంట్రీని ఘనంగా చాటుకున్నారు.అప్పటి నుంచి ఆయన దూకుడికి అదుపే లేకుండా పోయింది..పట్టిందల్లా బంగారం..చుట్టిందల్లా పాగా.. వేసేసాడు రాష్ట్ర రాజకీయ ఖిల్లాలో పాగా..!

ఆ విజయం..తదనంతర ప్రస్థానం సత్తిబాబుని వైఎస్ కు అత్యంత సన్నిహితున్ని చేసింది.అంతటి రాజశేఖరరెడ్డి కూడా ఊ అంటే సత్తిబాబు.. ఆ అంటే సత్తిబాబు అనే లెవెల్ ..అనంతరం 2004 ఎన్నికల్లో వేదిక మార్చి చీపురుపల్లి నుంచి అసెంబ్లీకి ప్రయాణం..పెద్దాయన..కురువృద్ధుడు పెనుమత్స సాంబశివరాజుని త్రోసిరాజని వైఎస్ కొలువులో ఆమాత్య పదవి..వోక్స్ వ్యాగన్ ఉదంతం ఇబ్బంది పెట్టినా.. రాజన్న చలవతో ఒకదాని వెంట ఒకటిగా మంత్రిత్వ శాఖలు.. మహానేత మరణం తర్వాత.. కీలక పదవి కోసం వ్యూహాలు.. ఒకటి రెండుసార్లు దక్కినట్టే అనిపించి చేజారిన అందలం..

నిజానికి ఈ ఉపోద్ఘాతం ఇంకా పూర్తి కాలేదు..అయితే ఇదంతా ఎందుకో చెప్పాలి కదా..అలా విజయనగరం జిల్లాలోని ఒక గ్రామంలో సహకార సంఘం అధ్యక్షుడిగా మొదలైన సత్తిబాబు ప్రస్థానం ఇంచుమించు ముఖ్యమంత్రి అయిపోతారేమో అన్నతీరున గొప్ప జోరుగా సాగి..2014 నాటికి ఒక్కసారిగా చతికిలపడింది..

ఎలా..ఎందుకు జగన్ ఆగమనం..2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం.. ఉమ్మడి రాష్ట్రంలో పార్టీ అడ్రస్ గల్లంతయిన పరిణామం.. ఈలోగా తల్లి కాంగ్రెస్ నుంచి పిల్ల కాంగ్రెస్ వైసీపీకి వలసలు.. కాస్త ఆలస్యంగా బొత్స కూడా జగన్ పంచన చేరడం..వచ్చినా ప్రాధాన్యత తగ్గడం..ఈలోగా 2019 ఎన్నికల్లో వైసీపీ

ఘనవిజయం..నలుగురితో నారాయణ అన్నట్టు సత్యనారాయణ కూడా గెలిచి అసెంబ్లీకి వెళ్ళడం.. అంచనాలకు అతీతంగా జగన్ తనకు పెద్దగా నప్పదు అనుకున్న బొత్సకి మంత్రి పదవి కట్టబెట్టడం. పునర్వ్యవస్థీకరణలో కూడా ఆయన పదవి భద్రంగా ఉండడం మరో ఆసక్తికర పరిణామం..

ఇంతలో..2024 ఎన్నికలు.. వైసీపీ దారుణంగా బోల్తా.. జిల్లాలో..అంతేనా ఉత్తరాంధ్రలో అందరితో పాటు బొత్స కూడా పరాజయం.అక్కడితో కాదు.విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి సత్తిబాబు సతీమణి ఝాన్సీలక్ష్మి కూడా ఓడిపోవడం ..ఇదంతా మరో పతన కథనం..

ఆ తర్వాత బొత్స పార్టీ మారతారని..ఎప్పటి నుంచో అనుకుంటున్నట్టు కమలం కండువా కప్పేసుకుంటారని... అటు కూటమిలోనే ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం వైపు కూడా ఒక అడుగు వేశారని.. ఇటు చిరంజీవితో ఉన్న సాన్నిహిత్యంతో జనసేన దిశగా కొన్ని ప్రయత్నాలు చేస్తారని..అబ్బో వరుస స్టోరీలు..మరీ కాకమ్మ కథలైతే కాదు గాని..అటూఇటూ అట.. అంట కబుర్లైతే ఉన్నాయి.. వీటన్నిటికీ చెక్ పెట్టేస్తూ జగన్మోహన రెడ్డి బొత్సకి ఒక బిస్కట్ లా అనొద్దు గాని.. పెద్ద ఎరగా ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టేసారు..ఎంపీ పదవి.. మంత్రిగా బోలెడు శాఖలు.. పిసిసి అధ్యక్ష హోదా..ఇన్ని చూసిన సత్తిబాబు..ఇప్పుడు ఎమ్మెల్సీ నా అని సత్తిబాబే అనుకున్నారో..జనం అనుకుంటున్నారని.. ఆ నోటా.. ఈ నోటా జగన్మోహనుడికే చేరిందో..నాకు ఇది వద్దు..ఇది వద్దంటే వద్దని సత్తిబాబే మారాము చేశారో..మొత్తానికి జగన్ మరో అడుగు ముందుకేసి..బొత్సకి మండలిలో వైసీపీ పక్ష నాయకుడు అనే టాగ్ లైన్ ఒకటి తగిలించారు.

ఇదీ క్లుప్తంగా..లేదా కాస్త సుదీర్ఘంగానే అనుకుందాం.. సత్తిబాబు సక్సెస్ అండ్ ఫెయిల్యూర్ కాంబో కహానీ.. ఇప్పుడు అసలు కథ..2024 ఎన్నికల్లో వైసీపీ నుంచి ఓడిపోయిన చాలా మంది ఘనాపాటీలను మించి.. ఎమ్మెల్సీ హోదా..వైసీపీ నాయకుడి లెవెలు సాధించుకుని రచ్చ గెలిచిన సత్తిబాబు ఇంట పరిస్థితి ఏంటి..ఒకనాడు చక్రం తిప్పిన సొంత జిల్లాలో ఆయన వైభోగం ఎలా ఉంది..

ఒకనాటి ఖిల్లాలో.. ఇప్పుడు ఉల్టా..!?

ఢిల్లీకి రాజైనా.. ఈ సూత్రాన్ని మాత్రం బొత్స సత్యనారాయణ ఉరఫ్ సత్తిబాబు ఒంటబట్టించుకోలేదు.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినా కుప్పాన్ని ఏ దశలోనూ విస్మరించలేదు..అలాగే.. రాజశేఖరరెడ్డి కూడా.. ఢిల్లీ వెళ్ళినా..సీఎం పీఠాన్ని అధిరోహించినా ఆయన ప్రాధాన్యత కడప జిల్లా.. మరీ ముఖ్యంగా పులివెందుల నియోజకవర్గం..ఈ ఇద్దరు పెద్ద నేతలూ తాము ఎంత స్థాయికి ఎదిగినా..ఇంకెంత బిజీగా ఉన్నా కూడా సొంత జిల్లాను..సొంత నియోజకవర్గాన్ని విడిచిపెట్టలేదు..తమ నియోజకవర్గం అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ.. అక్కడి ప్రజలు నిరంతరం తమ నామస్మరణే చేసుకునేలా వ్యవహరించారు.తాము బిజీగా ఉంటూ నియోజకవర్గాన్ని సందర్శించే వీలు పెద్దగా ఉండని పరిస్థితుల్లో తమ తరపున వ్యవహారాలు నడిపేందుకు సొంత మనుషుల్ని ఏర్పాటు చేసుకున్నా మొత్తం వ్యవహారాల్ని వారి మీద వదిలేయకుండా.. ఆయా వ్యక్తులకు ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ తమ ఉనికిని కాపాడుకుంటూ వచ్చారు..

ఇక్కడే సత్తిబాబు దెబ్బతిన్నారు.. 2009 నుంచి.. ఆయన జిల్లాకు దూరం అవుతూ వచ్చారు.ఇక 2014 ఓటమి తర్వాత మరీ నల్లపూస అయిపోయారు. 2014..19 మధ్య ఆయన జిల్లాకు ఎప్పుడు వచ్చిందీ.. వెళ్లిందీ..ఎవరికీ తెలియని పరిస్థితి..2019 లో మళ్ళీ గెలిచి మంత్రి అయినా ఆయన వ్యవహారశైలిలో మార్పు లేదు..జిల్లాకి..సొంత నియోజకవర్గానికీ చుట్టపు చూపే..ఆయన రాష్ట్రంలో మంత్రిగా అధికారంలో ఉండగానే ఇక్కడ జిల్లాలో అధికారం చేజారిపోయింది.. "ఇంకొకరి" చేతుల్లోకి ని"మజ్జి"నం అయిపోయింది.

అంతలోనే 2024 ఓటమి.. మాజీగా మారినా ఆ వెంటనే ఇంకో హోదా.. ఇప్పుడు జిల్లాకి ఆయన మరీ దూరం అయ్యారు.. నియోజకవర్గంలో జనం సొంత పార్టీలోనే వేరే గూటిలోకి చేరిపోయారు..

బొత్స ఉండేది విశాఖలో.. ఆయన్ని కలవడం కష్టం.. ఇదంతా ఆయనకే నష్టం.. జనం ఇప్పటికీ ఆయన పేరును జపిస్తున్నా ఆయన వైభోగం కోసం తపించడం మానేశారు.. ఆయన ఇప్పుడు సర్వం సహా చక్రవర్తి కాదు..నిర్దేశకుడూ కాదు..మా సత్తిబాబు అంతే.. ఇది ప్రాకృతం కాదండోయి.. స్వయంకృతం..!

వీటన్నిటికి తోడు.. ఒకదాని వెంట ఒకటిగా అనారోగ్య సమస్యలు.. ఇప్పుడు బొత్స పెద్దగా తిరిగే సీన్ లేదని పెద్ద టాక్.. ఇక రిటైర్మెంట్ తప్పదని ఇప్పుడిప్పుడే టాక్ మొదలైంది..ఈలోగా ఆయన ఎదుట పెద్ద టాస్క్ ఉంది..

అదేమిటో అందరికీ తెలిసినా.. బొత్స పరిస్థితిని.. ఆ టాస్క్ ను పూర్తి చేసుకోవడంలో ఆయన ఎదుర్కొనే ప్రతిబంధకాలను మరో కథనంలో చర్చిద్దాం.. త్వరలో..

స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన శ్రేణులు సన్నద్ధం కావాలి: ఒంపురూ గంగలయ్య

కొయ్యూరు మే 16 (మనసులో మాట): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని విజయపథంలో నడిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని అరకు పార్లమెంటరీ ఇంచార్జ్, జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ ఒంపురూ గంగలయ్య పిలుపునిచ్చారు. శనివారం కొయ్యూరు మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఒంపురూ గంగలయ్య మాట్లాడుతూ... కూటమి పొత్తులో భాగంగా మెజారిటీ స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేసేలా ప్రణాళికలు

సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేయడానికి, రాబోయే వ్యూహాలను ఖరారు చేయడానికి ఈ నెల 26 లేదా 28వ తేదీన కొయ్యూరు మండల జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని వెల్లడించారు.

ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, జనసైనికులు పెద్ద సంఖ్యలో హాజరై కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన కోరారు.ఈ అత్యవసర సమావేశంలో అరకు పార్లమెంటరీ సభ్యులు వీర వెంకట్, వంతల సుబ్బారావు, కొయ్యూరు జనసేన మండల ప్రెసిడెంట్ గూడెం లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి శేషుబాబు, కార్యనిర్వహణ అధికారి సుధీర్ బాబుతో పాటు పలువురు ముఖ్య నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల్లో పశువులకు తాగునీరు

కోటవురట్ల (మనసులో మాట).. వేసవి కాలం నేపథ్యంలో పశువులు, మేకలు, గొర్రెలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు తాగునీటి తొట్టెల్లో ఎప్పటికప్పుడు నీటిని నింపుతున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.కోటవురట్ల మండలంలో లింగాపురంలో రెండు, బీకె పల్లిలో ఒకటి, చౌడువాడలో ఒకటి, రాజుపేట ఒకటి, కె వెంకటాపురంలో రెండు,కొడవటిపూడిలో రెండు,కోటవురట్లలో ఒకటి, రామన్నపాలెంలో ఒకటి నిర్మించమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన వీటిలో నీటిని నింపే బాధ్యతలు సంబంధిత గ్రామ కార్యదర్శులకు అప్పగించామన్నారు. మోటార్ బోర్లు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసామన్నారు. ఎప్పటికప్పుడు వీటిని శుభ్రం చేసి నీటిని నింపాలని ఆదేశించామన్నారు. శనివారం వీటిని పరిశీలించినట్లు తెలిపారు. ఎంపీడీవో వెంట డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి రఘురాం

నేడు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం : కమిషనర్

విజయనగరం, మే 16 (మనసులో మాట) : నెల్లిమర్ల 500 ఎంఎం సిఐ పంపింగ్ లైన్ అయ్యప్ప నగర్ దగ్గర లీక్ అవ్వడం వలన తలెత్తిన మరమ్మత్తులు నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ బాలస్వామి పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వార్డు 1,8 పార్ట్,9,10,11,12,13,14 అనగా కొత్తపేట గొల్లవీధి, పద్మశాలి వీధి, శాలి వీధి , పులి గెడ్డ వారి వీధి, స్వీపర్ కాలని, సాకేటి వీధి,విజయ లక్ష్మీ నగర్, లక్ష్మి గణపతి నగర్, సిద్ధి వినాయక నగర్ , సాయి నగర్, హనుమాన్ నగర్, బూడి వీధి, బుంగ వీధి, అశోక్ నగర్, సుంకరి వీధి, మస్తాన్ వీధి, గోశాల, గోశాల హాస్పిటల్,మహారాణి పేట, అబాద్ వీధి, కోట్ల మాదప్ప వీధి,అయ్యకోనేరు, గౌడ వీధి, కబరిస్తాన్ గేట్, బొందిల గుండెం. ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మరమత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని, పూర్తయిన వెంటనే నీటి సరఫరాను యధాతధంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మరమ్మతు పనుల వలన కలిగిన అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్'కు నామినేషన్లు ఆహ్వానం

జిల్లాకు వివిధ సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు అవకాశం - జిల్లా కలెక్టర్ డా:ఎన్. ప్రభాకర రెడ్డి

పార్వతీపురం మనసులో మాట,మే 16: జాతీయ స్థాయిలో విపత్తు నిర్వహణ రంగంలో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలను గౌరవించేందుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ కు నామినేషన్లను ఆహ్వానిస్తునట్టు జిల్లా కలెక్టర్ డా:ఎన్. ప్రభాకర రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుందని పేర్కొన్నారు. విపత్తు నిర్వహణలో ప్రణాళిక, ముందస్తు హెచ్చరికలు, రక్షణ చర్యలు, సహాయక కార్యక్రమాలు, పునరావాసం, పునర్నిర్మాణం, పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, సామాజిక అవగాహన వంటి అంశాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులకు, సంస్థలకు ఈ అవార్డు ప్రదానం చేయబడుతుందని తెలిపారు. ఈ పురస్కారం వ్యక్తిగత మరియు సంస్థల

విభాగాల్లో ప్రదానం చేయబడుతుందని, వ్యక్తిగత విభాగంలో మెడల్, ప్రశంసాపత్రం, సంస్థల విభాగంలో స్క్రోల్ మరియు స్మారక చిహ్నం అందజేయడం జరుగుతుందన్నారు. జాతీయ అవార్డుల పోర్టల్ ద్వారా ఎప్పుడైనా నామినేషన్లు సమర్పించవచ్చని, స్వీయ నామినేషన్‌తో పాటు ఇతరుల ద్వారా కూడా ప్రతిపాదనలు పంపే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా స్థాయిలో విపత్తు నిర్వహణలో సేవలందిస్తున్న ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ఎన్‌జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, అత్యవసర సేవల బృందాలు, యువజన సంఘాలు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు మరియు వాలంటీర్ గ్రూపులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆపద సమయంలో హెచ్చరికల వ్యవస్థలు, గ్రామీణ స్థాయిలో విపత్తు నివారణ చర్యలు, వినూత్న సాంకేతిక పద్ధతులు, ప్రజల రక్షణ కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత గల వ్యక్తులు, సంస్థలు ఈ నామినేష్న నామినేష్ ల ప్రక్రియలో పాల్గొనాలని అన్నారు. విపత్తు నిర్వహణ రంగంలో గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న సేవా సంస్థలు, వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న వ్యక్తులు ఈ జాతీయ స్థాయి పురస్కారానికి దరఖాస్తు చేసుకొని తమ సేవలకు గుర్తింపు పొందాలని ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ తనిఖీలు

కంచరపాలెం, న్యూస్ మనసులోమాట,మే 16: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు శనివారం మధ్యాహ్నం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఈ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్కడి లోపాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఎమ్మెల్యే ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన డీఎంహెచ్ఓ జగదీశ్వరరావు, డీపీఎంఓ డాక్టర్ ఉమావతితో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. రికార్డులను పరిశీలించి, వైద్య సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధురవాడ పీహెచ్‌సీ వైద్య అధికారిని డాక్టర్ దీపికను అడిగి వివరాలు సేకరించారు. ఆసుపత్రిలో లోపాలను సరిదిద్ది, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులను హెచ్చరించారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా విజయనగరం : కమిషనర్

విజయనగరం, మే 16 (మనసులో మాట) : ప్లాస్టిక్ రహిత నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ప్రజలకు కమిషనర్ బాలస్వామి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కంటోన్మెంట్ ప్రాంతంలోని త్రిబుల్ ఆర్ సెంటర్ లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా త్రిబుల్ ఆర్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. అందరిచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రతినెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న విషయం విధితమేనన్నారు. ఒక్కో నెల ఒక్కో నినాదంతో స్వచ్ఛతకు పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు. ఈసారి సింగిల్ యూజ్ ప్లాస్టిక్

నిషేధాన్నే నినాదంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదన్నారు. నగరంలో త్రిబుల్ ఆర్ సెంటర్ ను 25 రోజుల్లో ఏర్పాటు చేయడం విశేషమన్నారు. రెడ్యూస్, రీ సైకిల్, రీ యూజ్ విధానం వల్ల ఎన్నో లాభదాయక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఏ రోజు చెత్తను అదే రోజు ప్రక్షాళన చేయడం అందరూ అలవర్చుకోవాలన్నారు. జీరో గార్బేజ్ విధానం శ్రేయస్కరం అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పునరుత్పాదన చేసేందుకు త్రిబుల్ ఆర్ సెంటర్ ను, సీ & డి వేస్ట్ కేంద్రాన్ని నెలకొల్పామన్నారు. నిరుపయోగ వస్తువులను పునర్వినియోగంలోకి తీసుకువస్తున్నామన్నారు. చెత్త తగ్గించడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలను ప్రజలు తమ వంతు బాధ్యతగా అలవర్చుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో ప్రజాభిప్రాయ సేకరణను రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలిపిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఉద్యాన శాఖ అధికారి సంతోష్, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, స్వయం సహాయక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌కు గురైన శిశువును గంటలోనే రక్షించిన పోలీసులకు నగదు రివార్డు

- అందిస్తున్న సీఐ ఎస్ విజయ్ కుమార్

హుకుంపేట మే 16 మనసుల మాట.. పాడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నాప్‌కు గురైన నెల రోజుల శిశువును గంట వ్యవధిలోనే గుర్తించి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించిన హుకుంపేట పోలీస్ స్టేషన్ సిబ్బందికి శనివారం నగదు రివార్డులు అందజేసినట్లు సీఐ ఎస్. విజయ్ కుమార్ తెలిపారు.

హుకుంపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై కె. దుర్గాప్రసాద్‌తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు జలంధర్, సత్యనారాయణ, కానిస్టేబుల్ లవకుశలకు నగదు బహుమతులు అందజేశారు. ఘటనపై వెంటనే స్పందించి చాకచక్యంగా బాలుడిని రక్షించడంపై సీఐ వారిని అభినందించారు.

ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాసేవలో అంకితభావంతో పనిచేసే సిబ్బందికి ఎల్లప్పుడూ గుర్తింపు, ప్రోత్సాహం ఉంటాయని అన్నారు. పోలీసు శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

రివార్డు అందుకున్న పోలీసు సిబ్బందిని స్థానికులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

గాజువాక సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పల్లా

గాజువాక (మనసులోమాట) మే 16.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం ఒక్క గాజువాక నియోజకవర్గం లోని 250 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ 71 వ వార్డు తోకాడ గ్రామంలో సుమారు 49.50 లక్షల వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్లు,కాలువల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ గాజువాక ప్రాంతం రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన నియోజకవర్గాలలో ఒకటిగా నిలుస్తుంది అని అన్నారు. ఆయా ప్రాంతాల్లో శంకుస్థాపన జరిగినప్పటికీ కొన్ని కారణాలవల్ల పనులు పూర్తి స్థాయిలో జరగడంలేదని వెంటనే వాటిపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. అన్ని వార్డుల్లోనూ కాలువలు కల్వర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తద్వారా రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ రాజాన రామారావు,వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేడ నాయుడు,కార్యదర్శి పైడి రామచంద్రరావు,పప్పు శంకరరావు,మళ్ళ రామునాయుడు,గోవింద్,ప్రసాద్,గోపి,నాయుడు, నక్కా రాజారావు,రమణ,శేషు,పైడిరాజు,డీఈ అప్పారావు, ఏఈ సంతోష్,వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గాజువాక (మనసులోమాట)మే 16.. గంగవరం రోడ్డులో జరిగిన విషాద ఘటన పట్ల టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కంబాల మాధవరావు గారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల చెక్ రూపం లో ఆర్థిక సహాయం అందించారు, ఇన్సూరెన్స్ సదుపాయం కూడా కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. గంగవరం ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని గంగవరం డబుల్ రోడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

మహిళల భద్రత పోలీసు వారి బాధ్యత

ఎస్. కోట, మే 16:(మనుసులో మాట): కొత్తవలస స్థానిక వెలుగు ఆఫీసులో " మహిళల భద్రత పోలీసు వారి బాధ్యత" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. కొత్తవల సీఐ గారు టీవీ విజయకుమార్ గారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు 1930 పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఇంట్లో దొంగతనాలు, ఆన్లైన్ మోసాలు, ఎదిగిన పిల్లలతో ఎక్కువసేపు మాట్లాడటం, ఊర్లో వెళ్ళినప్పుడు పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వడం, డిజిటల్ అరెస్టు , తెలియని లింకులు ఓపెన్ చేయడం , ప్రధాన వీధుల్లో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలని అని పలు విషయాలు పై అవగాహన చెయ్యడం జరిగింది.

అరకులోయలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర

అరకులోయ, మే 16 (మనసులో మాట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మూడవ శనివారం దినమునిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంఅరకులోయ మండలంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర (ఎస్ ఏ ఎస్ ఏ) కార్యక్రమం నిర్వహణలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి నిశాంతి ఆదేశాల మేరకు అరకులోయ మండలంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర (ఎస్ ఏ ఎస్ ఏ) కార్యక్రమాన్ని నిర్వహించిన్నట్లు అరకులోయ ఎంపీడీవోవీసం ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఎంటర్ప్రెన్యూర్స్ ఆఫ్ ఆంధ్ర అనే థీమ్‌తో శనివారం అరకులోయ మండలంలోనిఅన్నిగ్రామపంచాయతీలలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్రకార్యక్రమాలునిర్వహించి నట్లుతెలిపారు. పెదలబుడు గ్రామపంచాయతీ ఎన్‌డబ్ల్యూపీసీ ఆవరణలో ప్రధాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ మరియు అరకులోయ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగం, రీసైక్లింగ్ మరియు కంపోస్టింగ్ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు యువత, మహిళా సంఘాలు మరియు వ్యర్థ సేకరణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించే గ్రీన్ ఎంటర్ప్రెన్యూర్షిప్‌ను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని దొన్నుదొర తెలిపారు. అలాగే గ్రామస్థాయిలో ఆర్ ఆర్ ఆర్ సెంటర్ల బలోపేతం, స్వయం సహాయక సంఘాలకు శిక్షణ, పర్యావరణ హిత వ్యాపారాల ప్రోత్సాహం మరియు మార్కెట్ అనుసంధానం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కె కుమారస్వామి,డిప్యూటీ ఎంపీడీవో కె.వి.సత్యనారాయణ, ఏ ఎం సి చైర్ పర్సన్ బోరి బోరి లక్ష్మి, అరకులోయ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లోకోయి మహదేవ్, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, పెదలబుడు మాజీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది,యువజన సంఘాలు, పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రాలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పదవ తరగతి లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు బహుమతి

గాజువాక (మనసులోమాట) మే 16 .. పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో రాష్ట్రస్థాయి ఐదవ స్థానం, జిల్లా ప్రథమ స్థానం సంపాదించిన ఐ. దేవిక, పాఠశాల స్థాయిలో రెండవ స్థానం సంపాదించిన పి. పల్లవి లను గాజువాక శాసనసభ్యులు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ గారు నగదు బహుమతితో సత్కరించారు. గాజువాక నియోజకవర్గం లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతి పాఠశాల కి సంబంధించిన మొదటి ,ద్వితీయ స్థానాలు సంపాదించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతిగా 10,000 రూపాయలు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు గాజువాక నియోజకవర్గం లోని 10 ప్రభుత్వ పాఠశాలలు మరియు పెందుర్తి నియోజకవర్గం లోని ఇస్లాంపేట ప్రభుత్వ పాఠశాలలో మొదటి, ద్వితీయ స్థానాలు సంపాదించిన ఇద్దరికీ మొత్తంగా 25 మందికినగదు బహుమతులు అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నడుపూరు విద్యార్థిని దేవిక రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఐదవ స్థానం సంపాదించడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. సామాన్యమైన నిరుపేద కుటుంబాలకి చెందిన అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని వారందరికీ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహం ఇస్తుందని తెలియజేశారు .విద్యకి ఎనలేని ప్రోత్సాహాన్ని కూటమి ప్రభుత్వం ఇస్తున్నదని, విద్యార్థిని విద్యార్థులు సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకొని ఉన్నత స్థానాలకి ఎదగాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయి 1, 2, 3, స్థానాలు సంపాదించిన విద్యార్థిని విద్యార్థులు గాజువాక నియోజకవర్గం లో ఉండడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాచకొండ శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీ మండల బాధ్యులు పులి రమణారెడ్డి ,ప్రసాదుల శ్రీనివాసు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రామచంద్ర నాయుడు, షేక్ బాబ్జి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ కంపెనీల దోపిడీని కేంద్ర ప్రభుత్వం అరికట్టాలి..

భారీగా పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను రద్దు చేయాలి..ఎన్ ఎఫ్ ఐ ఆర్ టి డబ్ల్యూ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు జి వామనమూర్తి డిమాండ్

కంచరపాలెం, న్యూస్ మనసులోమాట, మే 16: ఆయిల్ కంపెనీల దోపిడీని కేంద్ర ప్రభుత్వం అరికట్టి, భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను రద్దు చేయాలని ఎన్ ఎఫ్ ఐ ఆర్ టి డబ్ల్యూ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు జి వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అక్కయ్యపాలెం, నరసింహ నగర్, రైతు బజార్ రోడ్ లో ఆటో డ్రైవర్లు చిల్లర వర్తకులు, ముఠా కళాశీలతో ధర్నా చేపట్టారు. నిరసనలో ఆయన మాట్లాడుతూ ఐ ఓ సి హెచ్ పి సి ఎల్ భారత పెట్రోలియం ఆయిల్ కంపెనీలు ధరలు పెంచి వాహనదారులు జేబులు కొడుతున్న ఆయిల్ కంపెనీల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి పేద కుటుంబానికి 15 లక్షల రూపాయలు బ్యాంక్ అకౌంట్ లో వేస్తామని హామీ ఇచ్చి 13 సంవత్సరాలు దాటిన ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. ధరలు పెంచి పేద మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తూ, బడ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దోచి పెడుతున్నారన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 37 సార్లు డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచిందని మండిపడ్డారు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిలు బేరల ధరలు తగ్గినప్పుడు దేశంలో డీజిల్ పెట్రోల్ పెంచడంతో పాటు వ్యాట్ పన్ను సెస్ పన్నులతో వాహనదారుల జేబులు కొట్టేసారని తెలిపారు. నేడు పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం బూస్ చూపించి దేశంలో డీజిలు పెట్రోల్ ధరల భారీగా పెంచడం వల్ల ప్రజల వాడే నిత్యవసరం వస్తువులు ధరల పెరిగి ఆహార భద్రత కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలపై ఆర్థిక భాహారాలు వేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రావి కృష్ణ, జి నీలకంఠం, పి సూర్యారావు, పి సాయికుమార్, కే నర్సింగ్ రావు, ఎం అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ హాజరును రద్దు చేయాలని వినతి

డుంబ్రిగుడ, మే 16 మనసులో మాట: మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో శ్రామికుల ముఖ హాజరును రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ఎంపీడీఓ విశ్వనాథ్కు వినతి పత్రాన్ని శనివారం అందజేశారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడారు. వలసల నివారణకు అమలు చేసిన ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. గిరిజన గ్రామాల్లో సరైన సెల్ సంకేతాలు లేవన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఉపాధి శ్రామికులకు ముఖ హాజరు నమోదు కావడం లేదన్నారు కూలికు వెళ్లిన శ్రామికులకు శ్రమకు తగ్గ ఫలితం లేక నిరాశ చెందుతూ పనికి వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ముఖ హాజరును మినాయిహించి 150 రోజుల పని దినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు డొంబు, మోహన్దాసు, లైకోన్, రాజు, రామ్మూర్తి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణ అందరి బాధ్యత

డుంబ్రిగుడ, మే 16, మనసులో మాట : ఆరోగ్యకర జీవన శైలితోపాటు మహమ్మరి డెంగ్యూ నివారణకు సమిష్టిగా కృషి చేద్దామని కిల్లోగుడ పీహెచ్సీ వైద్యాధికారి కుమార్రోత్న పిలుపునిచ్చారు. కిల్లోగుడ జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞను చేపట్టారు. అనంతరం గ్రామంలో డెంగ్యూతో కలిగే అనార్థాలపై వాల్ పోస్టర్లతో ర్యానిలీని చేపట్టి గిరిజనులకు అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి అయ్యే ప్రదేశాల్లో నీటి నిల్వలను శు యాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పూల కుండీలు, కూలర్లు, టైర్లు ఉండే చోట్ల నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి దరిచేరదని ఆయన అన్నారు. పీహెచ్ఎన్ జానకి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణ పేరుతో అవకతవకలు

- జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు దేవదాసు

డుంబ్రిగుడ, మే 16, మనసులో మాట: అరకులోయ కేంద్రంగా ట్రైకార్ నిధులతో గిరిజన యువతి, యువకులకు శిక్షణలో అవకతవకలు చోటు చేసుకున్నాయని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు దేవదాసు పత్రిక ప్రకనటలో ఆరోపించారు గత నెలలో మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన డ్రైవింగ్, బ్యూటీషియన్ శిక్షణను నిరుద్యోగులకు కల్పించారని చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో పరిశీలించిన తాను నిధులు వినియోగంలో అవకతవకలకు పాల్పడినట్లు పరిశీలనలో స్పష్టం చేయడం జరిగిందన్నారు. ఎనిమిది బ్యాచ్లకు శిక్షణ నిమిత్తం రిషి నాలెడ్జ్ హబ్ ఫౌండేషన్ అనే ఎన్టీవోకు మళ్లించినట్లు తమ పరిశీలనలో బయట పడిందన్నారు. శిక్షణలో 120మంది ఉండాల్సిన చోట కేవలం 60మంది ఉండడం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు శిక్షణ పేరుతో అవకతవకలపై విజిలెన్స్, ఏసీబీ, స్వతంత్ర సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలని రంపచోడవరం, అల్లూరి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నామని ఆయన తెలిపారు.

వితంతువులకు పెన్షన్లు ఎప్పుడిస్తావ్ బాబు...

శవపేటికలతో బాధితుల విన్నూత నిరసనలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వాసుపల్లి గణేష్ కుమార్

కంచరపాలెం, న్యూస్ మనసులోమాట, మే 16: భర్తను కోల్పోయిన మహిళలకు వితంతువుల పెన్షన్ ఎప్పుడు ఇస్తావు చంద్రబాబు అంటూ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అడిగారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొత్త పెన్షన్లు ఎప్పుడు ఇస్తావ్ బాబు అని శవపేటికలతో బాధితుల విన్నూత నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వం గడిచిన రెండు ఏళ్ల పాలన కోసం తెలంగాణలో సంబరాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ రెండు సంవత్సరాలలో ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వ లేని దద్దమ్మ ప్రభుత్వం అన్నారు. ఎంత మందికి సదరంలో ఫిజికల్ ఛాలెంజ్ సర్టిఫికెట్లు ఉన్నాయో మీకు తెలీదా అని అడిగారు. ఈ రెండేళ్లలో ఎంత మంది వితంతువులు తయారయ్యారో మీకు తెలీదా అంటూ, ఎంత మంది ఆక్సిడెంట్ అయి చనిపోయారో తెలియకపోతే, లోకేష్ స్మశానవాటికలో లిస్టు తెప్పించుకొని చూడాలని సూచించారు. కొత్త పెన్షన్లు ఇవ్వకపోయినా కనీసం చనిపోయిన వాళ్ల పెన్షన్లు వేరొకరికి ఇవ్వాలని కోరారు.

నేటికి సుమారు 6 లక్షల మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెన్షన్ దారులలో ఎప్పుడు పెన్షన్లు తీసేస్తారోనని గుబులు రేగింది అన్నారు. మే నెలలో సుమారు 12600 పెన్షన్లు కట్ చేసేసారని నేటి వరకు సుమారు 6లక్షల పెన్షన్లు తీసేసారని తెలిపారు. ఇప్పుడేమో పొదుపు జపం చేస్తున్నారని, పొదుపు ముందు మీ దగ్గర నుండి స్టార్ట్ చెయ్యాలని, కాన్వాయ్ తగ్గించి, సింగపూర్ టూర్ మానేసి హెలికాప్టర్ లో తిరగడాలు తగ్గించి కబుర్లు చెప్పాలన్నారు.కొత్త పెన్షన్లు ఇవ్వకపోతే చేతకాని ప్రభుత్వం దిగిపోవాలని విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలు దాటిన మహిళలకు రూ 15000, నిరుద్యోగ భృతి, 50 ఇయర్ పెన్షన్, ఫీజు రీయింబర్స్ అని నేటికి అమలు చేయలేదన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పి, 2029లో జగన్ ను అధికారంలోకి ప్రజలు తీసుకు వస్తారని జోష్యం చెప్పారు. అధిక సంఖ్యలో వితంతువులు, పెన్షనర్లు, వైసిపి నేతలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దళితుల పట్ల వివక్షత చూపుతున్న ఆర్ ఆర్ ఆర్ ను డిప్యూటీ స్పీకర్ పదవి నుండి తొలగించాలి - మాల మహానాడు డిమాండ్

కంచరపాలెం, న్యూస్ మనసులోమాట, మే 16: దళితుల పట్ల వివక్షత చూపుతున్న రఘు రామ కృష్ణంరాజు(ఆర్ ఆర్ ఆర్) ను డిప్యూటీ స్పీకర్ పదవి నుండి తొలగించాలని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాబు గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డాబా గార్డెన్స్, ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ

సుప్రీంకోర్టు ఇటీవల దళితులు క్రైస్తవ మతం స్వీకరిస్తే రిజర్వేషన్ కోల్పోతారని చెప్పడం సరికాదన్నారు. అలాగైతే అన్ని కులాల వారిలో క్రైస్తవ మతం స్వీకరించిన వారు ఉన్నారని తెలిపారు. హుండీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ ఆర్ఆర్ఆర్ దీనిపై మాట్లాడుతున్నారని, అలాగైతే కూటమిలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఆ విధంగా మాట్లాడుతున్నారని అడిగారు. దళితులను వేధిస్తున్న రఘు రామకృష్ణ రాజు పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. రఘురామకృష్ణమరాజు తమ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేగా హుందాగా వ్యవహరించి స్థానిక ప్రజా సమస్యలపై పనిచేయాలని సూచించారు. అలా కాకుండా వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో ఓడిపోతారని జోష్యం చెప్పారు. రాష్ట్రంలోని ఉన్నతాధికారికి, రఘురామకృష్ణంరాజుకి విభేదాలు ఉన్నాయని, వాటి పరంగా దళితులను రెచ్చగొట్టడం కించపరచడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి దళితులకు ఇవ్వాల్సిన దాంట్లో ఒక్క పైసా కూడా కేటాయించలేదని అన్నారు. అదే తరహాలో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో ఓడిపోతారని చెప్పారు. కాబట్టి తక్షణమే రఘురామకృష్ణంరాజును పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల దప్పు వాయిద్యకారుడిని టిడిపి నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు కొడితే, తామంతా ఖండించామని, బాధితుడు వారితో మాకు మంచి సంబంధం ఉన్నాయని చెప్పడం జరిగిందన్నారు. సమావేశంలో మాల మహానాడు నేతలు సియ్యాద్రి రాంబాబు, తీన్ మూర్తి, ప్రసాదు, ఆదినారాయణ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలి

- ధర్నాలో కొత్తపల్లి వెంకటరమణ డిమాండ్

కంచరపాలెం, న్యూస్ మనసులోమాట, మే 16: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని నవయాన బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకట రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ తన కొడుకును అరెస్టు కాకుండా అడ్డుకుంటున్నాడని దుయ్య బట్టారు. బండి సంజయ్ ఆ పదవిలో ఉంటే బాధితులకు న్యాయం జరగదని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టం కింద భగీరథ పై కేసులు నమోదైనా ఇప్పటివరకు ఎందుకు తెలంగాణ ప్రభుత్వం అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. అధికారం, డబ్బు ఉన్నవారికి చట్టం దాసోహం అవుతుందని, బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఉదాసీన వైఖరి తగదన్నారు. భగీరథతో పాటు ఇంకా ఎవరున్నారో వారందని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదించడం కోసమే ఈ హనీ ట్రాప్ చేస్తున్నారని, తాను బీసీ కావటం వల్లే ఇలా జరుగుతుందని బండి సంజయ్ కేసు పక్కదారి పట్టిస్తున్నాడని ఆరోపించారు. అనేక చట్టాలు ఉన్నప్పటికీ, మనువాద భావజాల అహంకారం వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు నేతలు వెంకటలక్ష్మి, డి రోహిణి, హెచ్ఆర్ఎఫ్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.